# DD9 వార్త

తెలుగు దినపత్రిక

www.dd9vaartha.com

సంపుటి : 01 సంచిక : 93 బుధవారం, నవంబర్ 19, 2025, పేజీలు - 10 వెల : 3/-


## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లే రైతులకు ఇబ్బందులు

**కరీంనగర్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణగా పత్తి రైతులు దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. మంగళవారం పత్తి రైతులను ఆదుకోవాలని కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. పత్తి విక్రయాలకు సీసీఐ అనేక కొర్రీలు పెట్టిందని, వీటి గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో తాను సివిల్ సప్లయ్ మినిస్టర్‌గా పని చేసినపుడు దొడ్డు వడ్లు తీసుకోమని కేంద్రం కొర్రీలు పెడితే రాష్ట్ర కేబినెట్ మొత్తం 11 రోజులు ఢిల్లీలో ఉండి సమస్యను పరిష్కరించామని గుర్తు చేశారు.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఢిల్లీ వెళ్లి సీసీఐతో కొట్లాడి రాష్ట్ర రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు పత్తి అమ్ముకోకుండా.. మిల్లర్లు కొనకుండా సీసీఐ అనేక కొర్రీలు పెట్టిందని, ఈ కారణంగానే జిన్నింగ్ మిల్లులు మూత పడ్డాయని అన్నారు.




## చిన్న పిల్లల మిస్సింగ్ కేసులు

దత్తత నిబంధనలు సరళీకరించాలని సుప్రీం సూచన




## వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

నేరుగా పొందేలా అవకాశం

ప్రారంభించిన తెలంగాణ ఐటి మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్,18 :** రాష్ట్రంలో మీ సేవ సేవలు అందుబాటులోకి వచ్చాక కుల, ఆదాయ వంటి ఇతరత్రా సర్టిఫికెట్స్ పొందడం ఈజీ అయిపోయింది. అ యితే ఈ సేవలను ప్రజలకు మరి ంత చేరువ మిగతా2లో...



## 20న నితీశ్ ప్రమాణస్వీకారం

- సిఎం చంద్రబాబుకు ఆహ్వానం

**అమరావతి, నవంబర్ 18:** బిహార్ రాజధాని పాట్నాలో జరిగే సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అందుకు ముహూర్తం ఖరారు అయింది. మిగతా2లో...



## ఎన్‌కౌంటర్‌లో హిడ్మా హతం

- ఛత్తీస్‌ఘడ్‌లో నిర్బంధంతో ఎపిలోకి మావోలు
- ముందస్తు సమాచారంతోనే కూంబింగ్
- అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడి



**పాడేరు, నవంబర్ 18:** ఛత్తీస్‌ఘడ్‌లో నిర్బంధం, దాడులు పెరగడంతోనే మావోలు ఎపి వైపు వచ్చారని, అలా ఇక్కడ ఎన్‌కౌంటర్‌కు గురయ్యా రని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు.అల్లూరి సీతారామ రాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై పోలీసులు ఉక్కుపాదం మోపటం వల్ల మిగతా2లో...

## ఎఐని గుడ్డిగా నమ్మి మోసపోవద్దు

ప్రత్యామ్నాయాలను కూడా అన్వేషించాలి


గూగుల్ సిఇవో సుందర్ పిచాయ్



**లండన్, నవంబర్ 18:** ఎఐని గుడ్డిగా నమ్మి మోసోవద్దని ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ గురించి గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ హెచ్చరిక చేశారు. ఏఐ ఇచ్చే సమాధానాలను గుడ్డిగా నమ్మొద్దంటూ యూజర్లకు సూచించారు. అలాగే, ఏఐ కంపెనీలకూ కీలక సూచన చేశారు. ఏఐ పెట్టుబడుల బూమ్ ఏ దశలోనైనా పగిలిపోవచ్చని, అందుకు కంపెనీలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆ ప్రభావానికి మిగతా2లో...

## సర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరు

- ఢిల్లీ రామ్‌లీలా మైదానంలో డిసెంబర్‌లో ర్యాలీ
- మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన కాంగ్రెస్ భేటీలో నిర్ణయం




**న్యూఢిల్లీ, నవంబర్ 18:** ఎస్ఐఆర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో డిసెంబర్ ప్రథమార్ధంలో ర్యాలీ నిర్వహించాలని కూడా కాంగ్రెస్ నిర్ణయిం చింది. ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్ పక్రియ ప్రస్తుతం కొనసాగుతున్న రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఓటర్ల ముసాయిదా జాబితాలో ఎలాంటి మిగతా2లో...



## కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

సిఎం రేవంత్ సమక్షంలో కుదిరిన అవగాహన

**హైదరాబాద్, నవంబర్ 18:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ ఏర్పా టుకు కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ తో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ అవగాహన ఒప్పందంతో ప్రముఖ డిజిటల్ విశ్వవిద్యా లయంగా ఓపెన్ వర్సిటీ అభివృద్ధి చెందనున్నది. బోధన, అభ్యాసం, పరిశోధనలను మెరుగుపరచడానికి అత్యాధునిక డిజిటల్ హబ్‌గా పనిచేస్తుంది. మిగతా2లో...

## కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో మేమూ భాగస్వామ్యం

30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిలో 10శాతం ఉంటాం

ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు

వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం

పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి




## అర్బన్ నక్సల్స్ ఉచ్చులో పడొద్దు

బతికున్న వారు వెంటనే లొంగిపోవావాలి

కేంద్రమంత్రి బండి సంజయ్ హితవు



**వేములవాడ,నవంబర్ 18 :** అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో జల్సా చేస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మావోయిస్టుల మరణాలకు అర్బన్ నక్సల్స్ కారకులని తెలిపారు. నక్సల్స్‌కు సపోర్ట్ చేసిన అర్బన్ నక్సల్స్ ద్రోహులని అభివర్ణించారు. తక్షణమే తుపాకీ వీడి జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు. వారిని చూసి మోసపోవద్దంటూ ప్రజలకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం వేములవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని అర్బన్ నక్సల్స్‌పై నిప్పులు చెరిగారు. వారి మాటలు నమ్మి అమాయక,పేద ప్రజలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేకుండా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 4 నెలల గడువు మాత్రమే ఉదంటూ ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన గుర్తు చేశారు. వచ్చే మార్చి నాటికి మావోయిజాన్ని అంతం చేసి తీరుతామని కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి ఏజెన్సీ ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున భారీ ఎన్‌కౌంటర్ జరిగింది.

## నేరడిగొండలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

- అధైర్యపడకండి... అన్నదాతలకు అండగా ఉంటాం
- మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్న కెటిఆర్



**ఆదిలాబాద్,18 :** రైతులు ఎవరూ అధైర్య పడక ండి, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎల్లవేళలా అండగా ఉంటామని రైతులకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది.. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామ ని ఆయన అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుల కు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని మిగతా2లో...

# పేరుమార్చి బనకచర్ల నిర్మాణం

### ఎపి తీరుపై పాటిల్ మందు అభ్యంతరం
### ఢిల్లీలో తెలంగాణ మంత్రి ఉత్తమ్ వెల్లడి



**న్యూఢిల్లీ,నవంబర్ 18 (పిసిడబ్ల్యూ న్యూస్):** పోలవరం-బనకచర్ల ప్రాజెక్టును ఏపీ ప్రభుత్వం పేరు మార్చి చేపడుతోందని, ఆ ప్రాజెక్టును పూర్తిగా వ్యతిరేకించామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి పాటిల్‌తో భేటీ అనంతరం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఆ ప్రాజెక్టును పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్రమంత్రిని కోరామని తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు భూ సేకరణ కోసం కర్ణాటక జీవో జారీ చేసింది. 519 మీటర్లకంటే ఎక్కువ ఎత్తు పెంచవద్దని సుప్రీంకోర్టు స్టే ఉంది. స్టే ఉండగానే కర్ణాటక ప్రభుత్వం ఎత్తు పెంచేందుకు చర్యలు చేపట్టింది. కర్ణాటక ప్రభుత్వం తెచ్చిన జీవోను కేంద్రజల్‌శక్తి మంత్రి దృష్టికి తీసుకెళ్లాం. తెలంగాణలోని పలు ఇరిగేషన్ ప్రాజెక్టులను నిధులివ్వాలని కోరామని అన్నారు. మా ప్రభుత్వంలో కేఆర్‌ఎంబీ టెలిమెట్రీ స్టేషన్ పనుల్లో పురోగతి వచ్చింది. కేఆర్‌ఎంబీ టెలిమెట్రీ స్టేషన్ పనులు త్వరగా పూర్తి చేయాని అడిగాం.. మరో 20 టెలిమెట్రీ స్టేషన్ల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. ఫేజ్-2లో 9, ఫేజ్-3లో 11 నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## సర్,ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరు

(మొదటి పేజీ తరువాయి)

అవకతవకలు జరిగినా దానిని వెంటనే పార్టీ నేతలు సవాలు చేయాలని కాంగ్రెస్ కోరింది. మంగళవారంనాడిక్కడ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన సమావేశంలో 12 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల పార్టీ నేతలు, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పాల్గొన్నారు. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం, ఎస్ఐఆర్ పూర్తి భిన్నమైన స్వభావం కలిగి ఉందని, గతంలో ఈ ప్రక్రియ చేపట్టినప్పుడు తీసుకున్న సమయంతో పోల్చుకుంటే చాలా తక్కువ వ్యవధిలో పూర్తిచేయాలనే ఆరాటమే కనిపిస్తోందని మెజారిటీ నేతలు సమావేశంలో అభిప్రాయపడ్డారు. తగినంత మంది బూత్ స్థాయి ఏజెంట్లను ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చినట్టు రాష్ట్రాల నేతలు పార్టీ అధిష్ఠానానికి వివరించారు. దీనిపై కేంద్ర నాయకులు స్పందిస్తూ, ముసాయిదా జాబితా నుంచి ఉద్దేశపూర్వకంగా ఎవరినైనా తొలగించినా, బోగస్ ఓటర్లను చేర్చినా వెంటనే అభ్యంతరాలు లేవనెత్తాలని పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశర చేసింది. బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యంతరాలను నమోదు చేయకపోవడం వల్లే ఓటర్ల జాబితా సరిగానే ఉందని, పార్టీలు ఎలాంటి అభ్యంతరాలు చెప్పలేదని ఎన్నికల కమిషన్ ప్రకటించుకున్నట్టు పేర్కొంది. బిహార్ తరహాలో కాకుండా ఈసారి ముసాయిదా జాబితాలో ఎలాంటి అవకతవకలు కనిపించినా లీగల్ టీమ్‌ల సాయంతో అభ్యంతరాలు తెలియజేయాలని,్గ ÷నైల్ లిస్ట్ తర్వాత కూడా అప్పీల్స్ చేయాలని పార్టీ కేంద్ర నాయకులు సూచనలు చేశారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఎస్ఐఆర్ ఎక్సర్‌సైజ్‌పై మానిటర్ చేసే మెకానిజం ఉన్నా చిన్న పార్టీలకు ఆ అవకాశం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఏ ఒక్కరు ఓటు కోల్పోకుండా చూడాల్సిన బాధ్యత ఈసీపై ఉందని, దాన్ని పార్టీల మీద నెట్టేయకూడదని అన్నారు. బీజేపీ షాడోలో ఈసీ పనిచేయరాదని, ఓట్ల చోరీకి ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయుధంగా చేసుకోరాదని ఖర్గే అన్నారు. ఈ విషయంలో పార్టీ కార్యకర్తలు, బీఎల్‌ఏలు, జిల్లా, సిటీ, బ్లాక్ అధ్యక్షులు అప్రమత్తంగా ఉండాలని, నిజమైన ఓటర్లను తొలగించడం, బోగస్ ఓట్లను చేర్చేందుకు చేసే ఎలాంటి ప్రయత్నం జరిగినా వెంటనే బయటపెట్టాలని సూచించారు.

## కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో మేమూ భాగస్వామ్యం




**హైదరాబాద్,నవంబర్ 18 :** హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమీలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన దిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్‌ఆర్‌ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామని అన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు.

## వాట్సాప్‌లో మీ సేవ పోర్టల్

(మొదటి పేజీ తరువాయి)

చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై పదే పదే మీ-సేవ కేంద్రాలకు వెళ్లే శ్రమ తగ్గించడానికి, మీ-సేవకు సంబంధించిన అన్ని సేవలను ఇకపై వాట్సాప్ ద్వారానే అందించనుంది. తెలంగాణలో ఇకపై వాట్సాప్‌లోనే మీ-సేవ సర్టిఫికెట్లు అందనున్నాయి. వాట్సాప్ మీసేవ సర్వీసులను(మీ సేవ సర్వీసెస్ ఆన్ వాట్సాప్) బంజారాహిల్స్ లోని తాజ్ కృష్ణలో మంత్రి శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. 38 ప్రభుత్వ విభాగాలకు చెందిన 580కి పైగా మీ సేవా సర్వీసులను వాట్సాప్ ద్వారా పొందే విధంగా ఏర్పాట్లు చేశారు. మెటా, మీ సేవ సంయుక్త భాగస్వామ్యంతో ఈ సౌకర్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ సేవ సెంటర్స్ చుట్టూ తిరిగే పని లేకుండా సేవలను సులభతరం చేసింది తెలంగాణ ప్రభుత్వం.. వినియోగదారులు వాట్సాప్ లోనే సర్టిఫికెట్స్ పొందే అవకాశం కల్పించింది. మీ-సేవ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత దానికి సంబంధించిన తాజా అప్‌డేట్స్ అన్నీ వాట్సాప్‌లోనే చెక్ చేసుకోవచ్చు. అంతేకాకుండా దరఖాస్తు చేసిన సర్టిఫికెట్ ఆమోదం పొందితే ఆ సర్టిఫికెట్‌ను సైతం వాట్సాప్ ద్వారానే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. 8096958096 వాట్సాప్ నెంబర్ ద్వారా మీ సేవ సర్వీసెస్ ఉపయోగించుకోవచ్చు. ఇన్కమ్ సర్టిఫికెట్, బర్త్ సర్టిఫికెట్, డెత్ సర్టిఫికెట్, రెసిడెన్సీ సర్టిఫికెట్, కమ్యూనిటీ / డేట్ ఆఫ్ బర్త్, పోలీస్ చలాన్, రెన్యువల్ ఆఫ్ రేషన్ షాప్స్, టెంపుల్ సర్వీసెస్, బిల్డింగ్ పర్మిషన్, వెహికిల్ లైఫ్ ట్యాక్స్, లైసెన్స్, ప్రాపర్టీ ట్యాక్స్ సేవలు ఇక వాట్సాప్ లోనే పొందొచ్చు. త్వరలోనే మరిన్ని వాట్సాప్ సర్వీసులను ప్రారంభించనున్నది ప్రభుత్వం.. వాట్సాప్ లో 580 ప్రభుత్వ సర్వీసెస్ ను అందించడానికి ప్రభుత్వ ప్రణాళికలు చేస్తోంది.

## కామన్‌వెల్త్ లర్నింగ్‌తో ఓపెన్ వర్సిటీ ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

టెక్నాలజీ ద్వారా నాణ్యమైన విద్యను అందించనున్నది. తెలంగాణలో విద్యా ప్రమాణాలు పెంచడంతో పాటు వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసారు.రాష్ట్రంలోని యూనివర్సిటీలను బలోపేతం చేయడంతో పాటు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీని ఒక నాలెడ్జ్ హబ్ గా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. దాని సిఇవో అధ్యక్షుడు పీటర్ స్కాట్ కు ముఖ్యమంత్రి వివరించారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వైస్ చాన్స్ లర్ ఘంటా చక్రపాణి, సిఎంస్పెషల్‌సెక్రటరీ అజిత్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాజధాని ఢిల్లీలో మరోమారు బాంబు బెదిరింపులు

### ● పాటియాల కోర్టు తదితర ప్రాంతాల్లో స్క్వాడ్ తనిఖీలు

**న్యూఢిల్లీ,నవంబర్ 18 :** దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు కలకలం రేపాయి. రాజధానిలోని పలు కోర్టులు, పాఠశాలలే లక్ష్యంగా బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. సాకేత్ కోర్టు, పాటియాలా హౌస్ కోర్టు, తీస్ హజారీ కోర్టు సహా ఇతర జిల్లా కోర్టులకు మంగళవారం ఉదయం బాంబు బెదిరింపులు వచ్చాయి. అంతేకాదు నగరంలోని ద్వారకా, ప్రశాంత్ విహార్ ప్రాంతాల్లోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలను లక్ష్యంగా చేసుకొని బెదిరింపులకు పాల్పడ్డారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే భద్రతా చర్యలు చేపట్టారు. బృందాలుగా విడిపోయి కోర్టులు, పాఠశాలల ప్రాంగణాలకు చేరుకున్నారు. ముందు జాగ్రత్త చర్యగా కోర్టు ప్రాంగణాలతోపాటూ పాఠశాలలను ఖాళీ చేయించిన అధికారులు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అంతేకాదు, నగరంలోని అన్ని జిల్లా కోర్టుల్లోని సిబ్బందిని అప్రమత్తం చేసి భద్రతా తనిఖీలు చేపట్టారు.

## చిన్న పిల్లల మిస్సింగ్ కేసులు

### ● దత్తత నిబంధనలు సరళీకరించాలని సుప్రీం సూచన

**న్యూఢిల్లీ,నవంబర్ 18 :** ఇటీవల పలు రాష్ట్రాల్లో చిన్నారుల మిస్సింగ్ పై మీడియాలో వార్తలు సుప్రీంకోర్టు దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో చిన్నారుల మిస్సింగ్‌పై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రతి ఎనిమిది నిమిషాలకొక చిన్నారి మిస్ అవుతున్నారనే వార్తలు వస్తున్నాయని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న తెలిపారు. ఈ క్రమంలో దత్తత నిబంధనలు సరళీకృతం చేయాలని సూచించారు. పిల్లల దత్తత నిబంధనలు కఠినతరంగా ఉండటం వల్ల అక్రమ పద్ధతుల్లో దత్తత తీసుకుంటున్నారని వ్యాఖ్యానించారు నాగరత్న. చిన్నారుల మిస్సింగ్ అంశంపై జిల్లాకు ఒక నోడల్ అధికారిని ఏర్పాటు చేయాలని గత విచారణలో సూచించింది సుప్రీంకోర్టు. తెలంగాణలో అక్రమ దత్తత వ్యవహారంలో పలు కేసులు బయటకు వచ్చాయని న్యాయవాది గుర్తుచేశారు.

## 20న నితీశ్ ప్రమాణస్వీకారం

(మొదటి పేజీ తరువాయి)

సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆహ్వానం అందింది. నవంబర్ 20వ తేదీన వీరు బిహార్ వెళ్లనున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించిన వివరాలను బిహార్‌లోని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా వివరించారు. 243 అసెంబ్లీ స్థానాలు ఉన్న బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా.. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల ఫలితాలను నవంబర్ 14వ తేదీన లెక్కించారు. ఈ ఎన్నికల్లో బిహార్ ఓటరు ఎన్డీయేకు వరుసగా మరోసారి పట్టం కట్టాడు. జేడీ (యూ) అధినేత నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకోసం రాజధాని పాట్నాలో ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. ఈ సీఎం నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్టీల అధినేతలు, మిత్రపక్షాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు ఆయన కేబినెట్ సహచరులంతా హాజరువుతారని సమాచారం. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రముఖులు వస్తుండడంతో.. పాట్నాలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఎన్‌కౌంటర్‌లో హిడ్మా హతం

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతానికి వారు చేరుకున్నారన్నారు. మావోయిస్టుల ఉద్యమాలకు ప్రజాదరణ లేదని పేర్కొన్నారు. జనజీవనస్రవంతిలోకి రావాలంటూ ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన పిలుపు నిచ్చారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. ఇప్పటికే మృతి చెందిన మావోయిస్టుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని చెప్పారు.మంగళవారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ వివరాలను జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్.. వివరించారు. మరో ఐదుగురు మావోయిస్టులు ఘటనా స్థలం నుంచి తప్పించు కున్నారన్నారు. వారి కోసం కూంబింగ్ కొనసాగుతోందని చెప్పారు. మరణించిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా 28 హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నారని వివరించారు. అతడిపై అనేక రివార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. హిడ్మా కదలికలపై గత మూడు వారాలు నుంచే సమాచారం ఉందన్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతోపాటు అతడి అనుచరులు మరణించారని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ధృవీకరించారు. మంగళవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మావోయిస్టుల కోసం కూంబింగ్ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందన్నారు. అలాగే మావోయిస్టుల కదిలకపై నిఘా ఉంటుందని తెలిపారు. మావోయిస్టులపై ఇతర రాష్ట్రాల్లో్ర పోలీస్ నిఘా అధికంగా ఉండడంతో అగ్రనేతలంతా ఏవోబీలోకి ప్రవేశిస్తున్నారని వివరించారు.విశాఖ రేంజ్‌లో మావోయిస్టులకు ఆశ్రమ పొందేందుకు చోటు లేదన్నారు. భవిష్యత్తు ముందని..గంజాయి వద్దని యువత ఆయన సూచించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా చైతన్యం కల్పించడం కోసం అభ్యుదయ సైకిల్ యాత్ర చేపట్టామని డీఐజీ స్పష్టం చేశారు. అనంతరం నర్సీపట్నం డి.ఎస్.పి కార్యాలయంలో వార్షిక తనిఖీల్లో భాగంగా వివిధ నేర చరిత్రలపై రికార్డులను విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి పరిశీలించారు.

## ఎఐని గుడ్డిగా నమ్మి మోసపోవద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఎవరూ అతీతులు కాదని పేర్కొన్నారు. వచ్చే రెండేళ్లలో మౌలిక సదుపాయాలు, పరిశోధనలపై 5 బిలియన్ పౌండ్లను ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. బీబీసీకిచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. ప్రస్తుత ఏఐ మోడళ్లలో తప్పులు చేసే అవకాశం ఉందని, అందువల్ల ఇతర టూల్స్‌తోనూ సమాచారాన్ని ధ్రువీకరించుకోవడం అవసరమని సుందర్ పిచాయ్ అభిప్రాయ పడ్డారు. ఏఐపైనే ఆధారపడకుండా, విభిన్న మాధ్యమాలతో కూడిన సమాచార వ్యవస్థ ఉండటం ముఖ్యం అని పేర్కొన్నారు. 'ఆ కారణంగానే ప్రజలు గూగుల్ సెర్చ్‌ను కూడా ఉపయోగిస్తున్నారు. కచ్చితమైన సమాచారాన్ని అందించేందుకు మేం చాలా కృషి చేస్తాం' అని ఆయన చెప్పారు. సృజనాత్మక రచన వంటి విషయాల్లో ఏఐ ఉపయోగకరమే అయినా.. ఏఐ చెప్పిందంతా నమ్మడం సరికాదని పిచాయ్ చెప్పారు. ఈ రంగంలో అత్యాధునిక ఏఐ సాంకేతికతలో కూడా కొన్ని పొరపా ట్లు తప్పవని ఆయన తెలిపారు. ఇటీవల గూగుల్ తన జెమినీ చాట్‌బాట్ ఆధారిత ఏఐ మోడ్‌ను సెర్చ్‌లో ప్రవేశపెట్టింది. వినియోగదారులకు నిపుణులతో మాట్లాడుతున్న అనుభవం ఇవ్వడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ పేర్కొంది. ప్రస్తుత ఏఐ పెట్టుబడుల వృద్ధి రోజురోజుకీ పెరిగిపోతున్న ప్పటికీ, దానిలో అహేతుకత కూడా కనిపిస్తోందన్నారు. చిప్‌ల నుంచి యూట్యూబ్ డేటా వరకు, మోడళ్ల నుంచి ఫ్రాంటియర్ సైన్స్ వరకు అన్ని సాంకేతిక సెగ్మెంట్‌లను స్వయంగా కలిగి ఉండటం వల్లే ఏఐ మార్కెట్‌లో ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకునే స్థాయిలో గూగుల్ ఉందని పిచాయ్ అన్నారు. అలాగే యూకేలో తమ పెట్టుబడులు విస్తరిస్తున్నట్లు వెల్లడించారు.

## నేరడిగొండలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

(మొదటి పేజీ తరువాయి)

కేటీఆర్ గుర్తుచేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని కేటీఆర్ అన్నారు. రైతులు అధైర్య పడకూడదని, రైతులకు అండగా బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కేసీఆర్ ఎల్లావేళలా అండగా ఉంటారని అన్నదాతలకు ధైర్యం చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని గుర్తుచేశారు.

# పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: ఎమ్మెల్యే ధన్ పాల్ గుప్తా పిలుపు



**నిజామాబాద్, నవంబర్ 18(డీడీ9 వార్త):** ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా పిలుపునిచ్చారు. నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో అర్బన్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల అంకితభావం వల్లే పార్టీ పటిష్టపడుతుందని స్పష్టం చేస్తూ, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బూత్ కమిటీలను బలోపేతం చేయాలని, పార్టీ అంతర్గత క్రమశిక్షణ, ఐక్యత, ప్రజల విశ్వాసం పెంపొందించడంలో అందరూ కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నాగోల్ల లక్ష్మీనారాయణ, పోతన్కర్ లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు రాజు, జిల్లా కార్యదర్శి జ్యోతి వీరేందర్, మండల అధ్యక్షులు ఆనందరావు భూపతి పాల్గొన్నారు

# ఆకలి తీర్చాలి, అభ్యాసం నిలబెట్టాలి

**బజార్ హత్నూర్, నవంబర్, 18(జనం%9వార్త):** ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అవసరం, అమలు, ఆర్థిక మార్గాలుపాఠశాల దాటి కళాశాలకు మధ్యాహ్న భోజనం ఎప్పుడు వస్తుంది? భారతదేశంలో మధ్యాహ్న భోజన పథకం అనేది (పీఎం - పోషణ్)విద్యార్థులపోషకాహారం, హాజరు, ఫలితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు ఇది చట్టబద్ధ హక్కుగా అమలవుతుండగా, తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా 9 నుంచి 10వ తరగతులకూ విస్తరించింది. అయితే ఇంటర్మీడియట్ దశ (11%-%12 తరగతులు) లో విద్యార్థులు ఈ సౌకర్యానికి దూరమవుతున్నారు. ఇదే దశలో అధిక డ్రాప్‌అవుట్‌లు, పోషకాహార లోపాలుకనిపిస్తుండటం ఆందోళనకర విషయం. ఇంటర్ దశలో ప్రత్యేక సవాళ్లు పోషకాహార లోపం:5 సర్వే ప్రకారం 15%-%19 ఏళ్ల అమ్మాయిలలో 60% మరియు అబ్బాయిలలో 30% రక్తహీనతతో బాధపడుతున్నారు.ఆర్థిక ఇబ్బందులు: బడుగు బలహీన దారిద్ర రేఖకు దిగువన ఉన్న పేద గ్రామీణ అణగారిన వర్గాల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎక్కువగా చదువుతున్నారు.-హాజరు సమస్యలు: తండాలు గూడెంలు మరియు చిన్న ఊర్ల నుండి వస్తున్న విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎక్కువగా ప్రవేశాలు తీసుకుంటున్నారు. ఇక మండల కేంద్రం నుంచి వచ్చే విద్యార్థులు భోజనం కోసం ఇంటికి వెళ్లి తిరిగి కాలేజీకి రాని పరిస్థితులు తరచుగా కనిపిస్తున్నాయి.డ్రాప్ అవుట్ ప్రభావం: మధ్యాహ్న భోజనం లేకపోవడం వలన చదువుకు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. చట్టం ఏమి చెబుతోంది?జాతీయ ఆహార భద్రత చట్టం (2013) ప్రకారం మధ్యాహ్న భోజనం హక్కు 8వ తరగతి వరకు మాత్రమే.అయితే రాష్ట్రాలకు అధికారం ఉంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 9 10 తరగతులకు స్వయంగా నిధులు కేటాయించి విజయవంతంగా నిర్వహిస్తుంది. అదే విధంగా 11 మరియు 12 తరగతులకూ విస్తరించడాన్ని చట్టం అడ్డుకోదు.అంటే ఇది కేవలం రాజకీయ సంకల్పం, ఆర్థిక ప్రాధాన్యత మీద ఆధారపడి ఉంది.ఆర్థిక వెసులుబాటు - నిధులు ఎక్కడి నుండి?1. రాష్ట్ర బడ్జెట్ ప్రత్యేక నిధి: పాఠశాల తరహాలో ఇంటర్ విద్యార్థులకు కూడా బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలి.2. సి ఎస్ ఆర్ ఫండ్స్: కంపెనీల సామాజిక బాధ్యత నిధులనుంచి విద్యార్థులకు ఉపకార వేతనాల రూపంలో అందిస్తూ మేనేజ్మెంట్ హాస్టల్స్ నిర్వహిస్తూ విద్యార్థుల ఆకలి తీర్చవచ్చు.3. ఎన్జీఓ భాగస్వామ్యం: అక్షయపాత్ర వంటి కేంద్రీ కృతవంటశాలల సహాయం తీసుకోవచ్చు.4. ఉన్న వనరుల వినియోగం: జిల్లా పరిషత్ పాఠశాలలు, సంక్షేమ విద్యాసంస్థల జూనియర్కాలా శాలలతోఅనుసంధానించేసు కోవచ్చు.5. మెను పునర్వ్యవస్థీకరణ: మిల్లెట్స్, పప్పులు, ఆకుకూరలతో తక్కువ ఖర్చులో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందజేయవచ్చు. అమలు - నాణ్యత %ం% పారదర్శకత-ఫుడ్ సేఫ్టీ పర్యవేక్షణ: ఆహార నాణ్యత కొరకు ఇంటర్మీడియట్ కాలేజీలకు సంబంధించి ఒక ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను నిర్మించుకోవచ్చు. లేదా ఉన్న వ్యవస్థతో ఆహార పరీక్షలు, నాణ్యత నియంత్రణ చేసుకోవచ్చు.-గ్రీన్ చానెల్ పేమెంట్స్: గ్రీన్ ఛానల్ పేమెంట్స్ ద్వారా బకాయిలు పేరుకుపోకుండానేరుగా చెల్లింపులు చేయవచ్చు.డిజిటల్ మానిటరింగ్: విద్యార్థుల యొక్క బయోమెట్రిక్ హాజరు, ముఖ గుర్తింపు హాజరు మరియు ఈ-బిల్లింగ్ వలన వృధాని అరికట్టవచ్చు.-సోషియల్ ఆడిట్లు: విద్యార్థి%-% తల్లిదండ్రుల కమిటీలు కాలేజ్ స్థాయిలో ఏర్పరచి పారదర్శకతను పరిశీలించవచ్చు.-విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు, అధ్యాపక సంఘాలు అమలులో సమస్యలు ఆచరణ యోగ్యసూచనలు ప్రభుత్వానికి అందించవచ్చు. -ముఖ్యంగా రాజకీయ నాయకులు అసెంబ్లీలోను, జిల్లాస్థాయిలో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలి. పైలట్ ప్రాజెక్టు నుంచి రాష్ట్రవ్యాప్తం వరకు 1. అత్యధిక డ్రాప్‌అవుట్ ఉన్న జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని మొదట అమలు పరచాలి. ఆ తరువాత ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్త విస్తరణ చేయాలి.2. ప్రతి వార్షిక బడ్జెట్లో ప్రభుత్వం స్థిర నిధి కేటాయించి చేయాలి.3.మిల్లెట్స్,గుడ్లు,పప్పులతో ప్రామాణికత ప్రత్యేక మెను తయారు చేసుకోవాలి."ఆకలి తీర్చాలి, అభ్యాసం నిలబెట్టాలి" అనే నినాదం కేవలం నినాదం మాత్రమే కాకూడదు - ఇది ఒక విద్యా విధానం. విద్యార్థులకు సమాన హక్కు, ఆరోగ్య భరోసాను కల్పించి ఉండాలి. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అక్కడితో ఆగిపోకుండా కొనసాగిస్తూ.. జూనియర్ కళాశాలలకు విస్తరిస్తేనే విద్యార్థుల భవిష్యత్తు వికసిస్తుంది.ప్రశ్న ఒక్కటే ఇంటర్ విద్యార్థులకు"ఎప్పుడుమధ్యాహ్నభోజనం మొదలుపెడతారని ?"

# భరోసా సెంటర్ ఆధ్వర్యంలో బాలికలకు భద్రత, హక్కులపై చైతన్యం




**నిజామాబాద్, నవంబర్ 18(డీడీ9 వార్త):** ప్రపంచ లైంగిక దుర్వినియోగం, వేధింపుల %ం% హింస నివారణ మరియు కోలుకొనడం దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్ భరోసా సెంటర్ బృందం ధర్మారం రెసిడెన్షియల్ పాఠశాలలోని విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అదనపు డీసీపీ (అడ్మిన్) బస్వరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినుల నుద్దేశించి ప్రసంగించారు. బాలికలకు తమ విద్య, వృత్తిపరమైన లక్ష్యాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి, సమాజంలో ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. ఎటువంటి ఆపద లేదా వేధింపుల సమస్య ఎదురైనప్పటికీ ఏమాత్రం భయపడకుండా తమ సమస్యను దాచుకోకుండా వెంటనే స్థానిక పోలీసులను లేదా భరోసా సెంటర్‌ను సంప్రదించాలని, తద్వారా నిందితులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని సూచించారు. బాలికల భద్రతకు, రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భరోసా సెంటర్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు..

# ఇచ్చోడ టోర్నమెంట్ లో మొదటి బహుమతిబాలికల

- జట్టులో ఆదిలాబాద్,రెండవ ది ఆసిఫాబాద్ కు దక్కాయి







**ఇచ్చోడ, నవంబర్ 18(జనం%9వార్త):-** ఈ క్రీడా పోటీలలో బాలికల జట్టులో ప్రథమ బహుమతి ఆదిలాబాద్ రెండవ బహుమతి ఆసిఫాబాద్ కైవసం చేసుకున్నారు.మంగళవారం రోజు ఇచ్చోడపాఠశాలలో నిర్వహించిన క్రీడా పోటీలలో బాలుర జట్టులో ప్రథమ బహుమతి ఆసిఫాబాద్ రెండవ బహుమతి నిర్మల్ జట్టు కైవసం చేసుకున్నాయి. ఈ క్రీడా పోటీలో అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందినటువంటి క్రీడాకారులను ఎంపిక చేశారు. అందులో ఉత్తమ ప్రతిభ కనబరిచినటువంటి క్రీడాకారులను ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు.జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇచ్చోడ పాఠశాలలో ఎస్ జి ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా



సాఫ్ట్బాల్ అండర్ 17 బాయ్స్ అండ్ గర్ల్స్ జోన్ల స్థాయి టోర్నమెంట్ నిర్వహించిన, జోనల్ స్థాయి టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా ఇచ్చోడఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి ఎస్ వి ప్రసాద్,సీనియర్ ఉపాధ్యాయులు ఏ.రమణ రెడ్డి ఆదిలాబాద్ జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి ఆడేరామే శ్వర్,వ్యాయామఉపాధ్యాయులు, జంజర్ల సాయికుమార్,ఏ.మోహన్ రెడ్డి,పీడీపాల్గొన్నారు

# నిజామాబాద్ బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శిగా బాలన్న



**నిజామాబాద్, నవంబర్ 18(డీడీ9 వార్త):** నిజామాబాద్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యానిర్వాహక కార్యదర్శిగా బాలన్నను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మంగళవారం తెలిపారు. గత కొద్ది రోజులుగా సంఘం జిల్లా సీనియర్ నాయకుడిగా బాలన్న అందిస్తున్న నిస్వార్థ సేవలను, క్రియాశీలక పాత్రను గుర్తించి ఈ పదవిని అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కార్యనిర్వాహక కార్యదర్శి బాలన్న మాట్లాడుతూ.. జిల్లాలో బీసీ సంఘం మరింత బలోపేతం కావడానికి, వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం తనవంతు పూర్తిస్థాయి కృషి చేస్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యక్షుడు అంజనేయులు, ప్రసాద్, దేవేందర్, రవి శంకర్, అజయ్, శ్రీలత, స్వామి చంద్రకాంత్, రమణ స్వామి, నాయకులు హాజరయ్యారు.

# నాణ్యమైన, సురక్షితమైన రహదారుల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు

**జుక్కల్,నవంబర్ 18(డిడి9 వార్త):** నియోజకవర్గం రహదారి అభివృద్ధి పనులను వేగవంతం చేయడం లక్ష్యంగా, మంగళవారం జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు తన క్యాంపు కార్యాలయంలో ఆర్-బి మరియు పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో నియోజకవర్గంలోని రోడ్ల ప్రస్తుత పరిస్థితిపై ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా చర్చించారు. దుస్థితిలో ఉన్న రహదారులను అత్యవసరంగా ప్రాధాన్యతగా గుర్తించి వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు.ఆర్%ం%బి శాఖ పరిధిలో కొనసాగుతున్న పనుల పురోగతిని ఎమ్మెల్యే సమీక్షించి పనులు నాణ్యతతో పాటు పూర్తి స్థాయిలో, వేగవంతంగా పూర్తి



చేయాలి అని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అలాగే, పంచాయతీ రాజ్ శాఖలో జరుగుతున్న రోడ్ల మరమ్మతులు,



అభివృద్ధి పనులు మరింత వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

# పెద్దకొడప్గల్ ప్రభుత్వ స్కూల్‌లో రూ.44 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అదనపు గదుల ప్రారంభం

- విద్యార్థులను సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి
- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు



**జుక్కల్,నవంబర్ 18(డిడి9 వార్త):** పెద్దకొడప్గల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.44 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అదనపు గదులను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, కొత్త తరగతి గదులను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ విద్య యొక్క మహత్యాన్ని విద్యార్థులు సరిగ్గా గ్రహించి, అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శిస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా బోధన నిర్వహించి, విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసి వారిని సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు.జుక్కల్ నియోజకవర్గంలో విద్యా







వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రతి పాఠశాలలో పాటు ఉపాధ్యాయుల కొరత నివారణతో పాటు లాబొరేటరీలు, తరగతి గదులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో మార్చడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విప్లవాత్మక చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రభుత్వం ప్రారంభించిందని అన్నారు.ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యం నిర్దేశించుకుని పట్టుదలతో చదివి, తమ గమ్యాలను సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఆరుగురికి జైలు, 14 మందికి భారీ జరిమానా

**నిజామాబాద్, నవంబర్ 18(డీడీ9 వార్త):** మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించగా పట్టుబడిన ఈ 20 మందికి మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించి, అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జాన్ ఎదుట హాజరుపరిచారు. ఈ కేసులను విచారించిన కోర్టు, ఆరుగురు నిందితులకు వారం రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ కఠిన తీర్పు ఇచ్చింది. మిగిలిన 14 మంది నిందితులకు మొత్తం 1,41,000 భారీ జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ ప్రసాద్ వెల్లడించారు.

# రానంపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి**







**బాన్సువాడ, నవంబర్ 18(డిడి9 వార్త) :** బాన్సువాడ నియోజకవర్గంలోని రుద్రూర్ మండలం రానంపల్లి గ్రామంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు కలిసి శంకుస్థాపన చేసి భూమి పూజలు నిర్వహించారు.గ్రామ అభివృద్ధి కోసం రూ. 50 లక్షల వ్యయంతో రానంపల్లి నుండి లింగంపల్లి మధ్య మెటల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులైన కాసుల అంజవ్వ హన్మండ్లు ఇల్లు నిర్మాణానికి భూమి పూజ నిర్వహించి, వారి కుటుంబ సభ్యులను అభినందించారు.ఈ కార్యక్రమంలో వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా, మండల ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో దేశ ఏకతా స్ఫూర్తితో యూనిటీ మార్చ్



**నిజామాబాద్, నవంబర్ 18(డీడీ9 వార్త) :** నిజామాబాద్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ఏక్ భారత్ ఆత్మ నిర్భయ భారత్ కార్యక్రమంలో భాగంగా మాట్ యూనిటీ మార్చ్ నిర్వహించారు. వర్ని చౌరస్తాలోని పటేల్ విగ్రహం నుంచి పాత కలెక్టర్ మైదానం వరకు ఈ రన్ కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూ... పటేల్‌ను 'ఉక్కుమనిషి' దేశ నిర్మాణ శిల్పిగా అభివర్ణించారు. స్వాతంత్ర పోరాటంతో పాటు దేశంలోని 562 సంస్థానాలను ఏకీకృతం చేయడంలో ఆయన చూపిన సాహసం కీలకమని కొనియాడారు. శాంతి, సోదర భావం, సమాజంలో ఐక్యత విలువైనవని అన్నారు. కేంద్రం అభివృద్ధి కృషికి తోడు అందరి సహకారంతో తాను అర్బన్ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేర భారత్ కోఆర్డినేటర్ శైలి బెల్లం, జిల్లా యువజన క్రీడల అధికారి పవన్ కుమార్, బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ రాజు నేలంతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కుమారుడి జన్మదినం సందర్భంగా 46వ సారి రక్తదానం చేసిన సంతోష్ రెడ్డి





**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త):** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కెబిసి రక్తనిధి కేంద్రంలో సదాశివనగర్ మండలం ధర్మారావుపేట్ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సామల సంతోష్ రెడ్డి తన కుమారుడు సామల కియాన్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని 46వసారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయనను రక్తనిధి కేంద్ర అధికారులు అభినందించారు.ఐవిఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు మాట్లాడుతూ సంతోష్ రెడ్డి గతంలో అనేక అత్యవసర పరిస్థితుల్లో గర్భిణీ స్త్రీలు, శస్త్రచికిత్సలు పొందుతున్న రోగులు, డెంగ్యూ బాధితుల కోసం సకాలంలో రక్తాన్ని అందజేసి ఎంతోమందికి ప్రాణదాతగా నిలిచారని పేర్కొన్నారు. రక్తానికి ప్రత్యామ్నాయం ఏదీ లేనందున యువత రక్తదానం వైపు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, నిర్వాహకులు జీవన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చేతుల మీదుగా కల్యాణలక్ష్మి- షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త) :** ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ నాగిరెడ్డిపేట మండలానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను అందజేశారు. మొత్తం 65 మంది లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో ఆర్థిక సహాయం పొందారు.ఈ కార్యక్రమానికి ఆర్‌డిఓ, ఎంఆర్‌ఓతో పాటు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరయ్యారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతీ కుటుంబానికి ప్రభుత్వ సహాయం చేరేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మదన్ మోహన్ తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల ప్రధాన లక్ష్యం సాధారణ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమేనని ఎమ్మెల్యే అన్నారు. చెక్కులు స్వీకరించిన లబ్ధిదారులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

# శాబ్దిపూర్‌లో ఐకెపి వరి కొనుగోలు కేంద్రం పరిశీలన

**- పాడి క్లీనర్ వినియోగంతో రైతులకు లాభాలు**
**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**







**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త) :** కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం సందర్శించి కేంద్రంలో జరుగుతున్న కార్యకలాపాలను పరిశీలించారు. రైతులకు పారదర్శకంగా, నష్టాలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసే విధానాన్ని కలెక్టర్ అభినందించారు.రైతులు తెచ్చిన వడ్లను ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేసి తూకం వేయడం జరుగుతోందని, ఈ విధానం వల్ల ధాన్యంలో ఉన్న ధూళి, ఇతర అశుద్ధ పదార్థాలు తొలగిపోయి రైతులకు తూకం నష్టాలు గణనీయంగా తగ్గుతున్నాయని కలెక్టర్ తెలిపారు.ఇప్పటి వరకు 76 మంది రైతుల నుండి మొత్తం 3,142 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సేకరించిన ధాన్యాన్ని 13 లారీల ద్వారా రైస్ మిల్లులకు పంపినట్లు మండల అధికారులు పేర్కొన్నారు. అందులో 9 ట్రక్ షీట్ల ఎంట్రీలు ట్యాబ్ లో పూర్తయ్యాయని మిగిలిన 4 ట్రక్ షీట్ లకు సంబంధించిన ధాన్య రుసుములు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.ప్యాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేయడం వల్ల రైతులకు ప్రతీ క్వింటాలు పై 1 కిలో 500 గ్రాముల వరకు ఆదా అవుతుందని రైతులు తెలియజేశారు.ఈ సందర్భంగా ఈ విధానం అత్యంత ప్రయోజనకరమని పేర్కొని, ప్రతి రైతు తప్పనిసరిగా చిన్ని పోయడం (ప్యాడి క్లీనర్ వినియోగం) చేయాలని సూచించారు.ఇలాంటి పారదర్శకమైన, విశ్వసనీయమైన విధానంతో పనిచేస్తున్న శాబ్ది పూర్ ప్యాడి కొనుగోలు కేంద్రాన్ని ఇతర కేంద్రాలు ఆదర్శంగా తీసుకోవాలి అని కలెక్టర్ సూచించారు.పాడి క్లీనర్ ద్వారా శుద్ధి చేసేందుకు రైతులు మరింత ముందుకు రావాలని కోరారు.

**- ఐకేపీ కేంద్రాల్లో ఆధునిక పాడి క్లీనర్లతో వరి సేకరణ ు రైతులకు లాభాలు, నాణ్యతకు హామీ**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో వరి సేకరణ ప్రక్రియ కీలక భూమిక పోషిస్తోంది. ఈ క్రమంలో ఐకెపి కేంద్రాలు పంట సేకరణలో పారదర్శకత, నాణ్యత, రైతు లాభానికి ప్రాముఖ్యతనిస్తూ ఆధునిక సౌకర్యాలను అందిస్తున్నాయి.జిల్లా వ్యాప్తంగా 196 ఐకెపి కేంద్రాల్లో పాడి క్లీనర్లసహాయంతో వరి ధాన్యాన్ని శుభ్రపరచి తూకం వేసి మిల్లర్లకు పంపించే ప్రక్రియ మరింత వేగవంతం అయింది.

**- పాడి క్లీనర్ల వినియోగంతో నాణ్యమైన ధాన్యం**

పాడి క్లీనర్ల ద్వారా వరిని తూర్పారబట్టడం వల్ల తరుగు తగ్గింపు కల్తీ పదార్థాల తొలగింపు, తూకం నష్టాల నివారణ

ప్రభుత్వ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా శుభ్రమైన ధాన్యం అందుబాటువంటి ప్రయోజనాలు లభిస్తున్నాయి.ఈ విధానంతో రైతులకు నష్టాలు తగ్గడంతో పాటు ధాన్య నాణ్యత కూడా పెరుగుతోంది.ప్రతి సంచికి 40.700 కిలోల ఖచ్చితమైన తూకం,ప్రతి ధాన్య సంచిని 40.700 కిలోల స్థిర తూకం ప్రకారం మిల్లర్లకు పంపిస్తున్నారు.ఈ విధంగా తూకం లోపాలు లేకుండా పూర్తిగా పారదర్శకంగా సేకరణ నిర్వహిస్తుండడం రైతుల్లో నమ్మకాన్ని పెంచుతోంది.

**- ప్రభుత్వ మద్దతు ధర %-%క్వింటాలుకు రూ. 2,389**

ప్రస్తుత సీజన్ కు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ. 2,389. ఈ ధరను కచ్చితంగా రైతులకు చేరేలా ఐకెపి కేంద్రాలు పనిచేస్తున్నాయి. శుభ్రపరిచిన ధాన్యాన్ని నాణ్యత పరీక్షల అనంతరం ఎమ్ఎస్పి ప్రకారం కొనుగోలు చేస్తున్నాయి.

**- రైతుల ఖాతాల్లోనే నేరుగా చెల్లింపు**


ఐకెపి కేంద్రాల్లో తూకం పూర్తి అయిన వెంటనే ధృవీకరించిన పరిమాణం ప్రకారం రైతుల వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో నేరుగా చెల్లింపులు జమ అవుతున్నాయి.ఇప్పటి వరకు సేకరణ ప్రక్రియలో పాల్గొన్న రైతుల ఖాతాలలో ఎమ్ఎస్పి ప్రకారం నిధులు జమ కావడం రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసానిస్తోంది.పాడి క్లీనర్ల వినియోగంతో ఐకెపి కేంద్రాల్లో వరి సేకరణ మరింత సమర్థవంతం అవుతోంది. నష్టాలు తగ్గి, నాణ్యత పెరుగుతూ, ఎమ్ఎస్పి ప్రకారం చెల్లింపులు సమయానికి రైతుల ఖాతాలలో జమ అవుతుండటం ప్రభుత్వ లక్ష్యం అయిన రైతు సంక్షేమానికి బాటలు వేస్తోంది.ఆధునిక టెక్నాలజీ వినియోగం ద్వారా రైతులకు మరింత సాయం అందించే దిశగా ఈ చర్యలు శ్లాఘనీయంగా మారాయి.ఈ కార్యక్రమంలో డిప్యూటి ట్రైనీ కలెక్టర్ రవితేజ, సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, ఐకెపి సురేందర్,డియం శ్రీకాంత్, తహసిల్దార్, జనార్ధన్, ఎంపిడిఓ, పంచాయితి సెక్రటరి, జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి-షుగర్ పరీక్షలు



**బాన్సువాడ,నవంబర్ 18(డిడి9 వార్త) :** మంగళవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి మంగళవారం నిర్వహించే రెగ్యులర్ ఉచిత కంటి పరీక్షలు సేవా కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. కంటి పరీక్షలు చేయించుకున్న లబ్ధిదారులకు ఈ సందర్భంగా ఉచితంగా షుగర్ పరీక్షలు కూడా నిర్వహించారు.కార్యక్రమంలో కంటి వైద్య సహాయకులు సతీష్, ల్యాబ్ టెక్నీషియన్ ప్రవీణ్, సేవలు అందించారు. అలాగే లయన్స్ క్లబ్ అధ్యక్షులు సితలె రమేష్, జోన్ ఛైర్మెన్ సంతోష్, సీనియర్ లయన్ కిషోర్ దాస్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పలువురు పేషంట్లు ఈ సేవలను వినియోగించుకున్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ చేపట్టిన ఈ కార్యక్రమానికి స్థానికులు మంచి స్పందన చూపుతున్నారు.

# జిల్లా పోలీసులు సిఈఐఆర్ ద్వారా 1,722 ఫోన్లు రికవరీ





**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త):** జిల్లాలో ఈ ఏడాదిలో 1,722 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి, సుమారు ?2.75 కోట్లు విలువను బాధితులకు తిరిగి అందజేసినట్లు జిల్లా పోలీసులు తెలిపారు.ప్రతీ నెల సగటున 150కి పైగా పోగొట్టబడిన ఫోన్లను జిల్లా పోలీస్ శాఖ సకాలంలో గుర్తించి,సిఈఐఆర్ ద్వారా రికవరీ చేస్తున్నారు. తాజాగా నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 143 మొబైల్ ఫోన్లు (సుమారు ?23 లక్షలు విలువ) రికవరీ అయ్యాయి.సిఈఐఆర్ పోర్టల్ ప్రారంభం నుండి, జిల్లాలో మొత్తం 4,169 ఫోన్లు, సుమారు ?6.67 కోట్లు విలువతో రికవరీ అయినట్లు పోలీసులు తెలిపారు.జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరి జీవితంలో నిత్యావసరమైన పరికరం. ఇందులో వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు, పాస్వర్డ్లు, సోషల్ మీడియా అకౌంట్లు, ఫోటోలు ఉంటాయి. ఫోన్ పోగొట్టినవారు కేవలం పరికరాన్ని మాత్రమే కాదు, తమ వ్యక్తిగత సమాచారాన్ని, ఆర్థిక భద్రతను కూడా కోల్పోతారు అని పేర్కొన్నారు.పోలీసులు పౌరులకోసం సిఈఐఆర్ సైట్ ద్వారా ఫోన్లను గుర్తించటం మరియు తిరిగి పొందటం కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

## మున్సిపల్ పరిశుద్ధ కార్మికుని కూతురు వివాహానికి రూ. 40 వేలు చేయూత అందజేశారు

**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త):** కామారెడ్డి పట్టణంలో మున్సిపల్ పరిశుద్ధ కార్మికుడు షేక్ మహబూబ్ కూతురు వివాహ వేడుక సందర్భంగా ఆర్థిక సౌలభ్యం లేకపోవడాన్ని దృష్టిలో పెట్టుకొని, టిపిసిసి రాష్ట్ర జనరల్ సెక్రటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి రూ. 40 వేలు విలువైన పెళ్లికానుక అందజేశారు.ఈ సానుకూల కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు పంపరి శ్రీనివాస్, జూలూరి సుధాకర్, చాట్ల వంశీ, సాయి బాబా, అలాగే మున్సిపల్ యూనియన్ నాయకులు ప్రభాకర్, ఆనంద్, ప్రభు, జ్యోతి, దీవెన పాల్గొన్నారు.

## పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

- జిన్నింగ్ మిల్లు యాజమాన్యం తమ నిరవధిక బంద్ విరమణ
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త) :** మంగళవారం సీసీఐ కేంద్రాలలో పత్తి కొనుగోలు సమస్యల పరిష్కారానికి కీలక సమావేశం జరిగింది. సీసీఐ సీఈఎండీ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు జిన్నింగ్ మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలు విన్నారు. హామీలను త్వరగా నెరవేర్చుతామని స్పష్టం చేసిన తర్వాత, జిన్నింగ్ మిల్లులు తమ నిరవధిక బంద్‌ను విరమించాయి.దీంతో రేపటి నుండి రైతులు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకురావచ్చు అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు.రైతుల పత్తి దిగుబడి ఎక్కువగా వచ్చిన సందర్భంలో క్రాప్ బుకింగ్ సమస్యలు తలెత్తకూడదని కలెక్టర్ సూచించారు. రైతులు తమ పత్తి దిగుబడిని వెంటనే గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి ద్వారా ఆన్లైన్‌లో నమోదు చేసి ధృవీకరించుకోవాలని చెప్పారు. ధృవీకరణ అనంతరం పత్తి నేరుగా సీసీఐ కేంద్రాలకు అమ్మకానికి తీసుకురావచ్చని కలెక్టర్ గుర్తు చేశారు.ం

## చలికాలం పొగమంచులో వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి : సీపీ సాయి చైతన్య



**నిజామాబాద్, నవంబర్ 18(డీడీ9 వార్త) :** చలికాలంలో పొగమంచు (ఫాగ్) తీవ్రత ఎక్కువగా ఉన్నందున రహదారులపై రోడ్డు ప్రమాదాలను నివారించడానికి వాహనదారులందరూ తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనదారులు, ఫోర్ వీలర్/భారీ వాహనదారులు ఇరువురూ వేగం తగ్గించి సురక్షిత దూరం పాటించాలని సూచించారు. హై బీమ్‌కు బదులుగా లో బీమ్ లైట్లను మాత్రమే వాడాలిని, సడన్ బ్రేకులు వేయకుండా తగ్గించి అవసరమైనపుడు ఇండికేటర్లను తప్పనిసరిగా ఉపయోగించాలని పేర్కొన్నారు., రాత్రి లేదా తెల్లవారుజామున పొగమంచు అధికంగా ఉన్నప్పుడు ప్రయాణాలు చేయకపోవడం ఉత్తమని తెలిపారు. వాహనదారులు ఎప్పటికప్పుడు వాహనం కండిషన్‌ను తనిఖీ చేసుకుని, తమ వాహనాలకు రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సూచించారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణ లక్ష్యాలను పకడ్బందీగా చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి పై మూడు మండలాల ఎంపిడిఓ లతో సమీక్ష సమావేశం.



**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త) :** మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో మూడు మండలాలైన మాచిరెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట్ ఎంపిడిఓ లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పురోగతి పై ఆరా తీశారు.ఈ సందర్భంగా మండలాల వారిగా ప్రోగ్రెస్ ను అడిగి తెలుసుకొని వంద శాతం ఇంటి నిర్మాణ పనుల లక్ష్యాలను చేరుకోవాలని, ప్రత్యేక చొరవ తీసుకుని వివిధ దశలో ఉన్న వాటిని వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు.ప్రతీ రోజూ మూడు మండలాలతో రివ్యూ నిర్వహించడం జరుగుతుందన్నారు.మాచిరెడ్డీ మొత్తం 345 మంజూరై మర్కావుట్ కాగా అందులో 200 ఇళ్లు ప్రోగ్రెస్ లో ఉన్నాయని, లింగం పెట్ 519 కి మంజూరు కాగా 397 ప్రారంభించి 310 పురోగతిలో ఉన్నాయని, అలాగే నాగిరెడ్డి మండలం లో 323 మంజూరులో 246 ప్రారంభించి 177 ప్రోగ్రెస్ లో ఉన్నాయని తెలిపారు పెండింగ్ లో ఉన్న వాటిని త్వరగా నిర్మాణ పనులు చేపట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పానీయాలకు దూరంగా ఉండాలి

- విద్యార్థులే దేశానికి వెన్నుముక
- నేటి బాలలే రేపటి పౌరులు
- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్







**కామారెడ్డి జిల్లా** కేంద్రంలోని కళాభారతి స్టేడియంలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి దీపప్రజ్వలన కార్యక్రమం నిర్వహించి, విద్యార్థులతో కలిసి సామూహిక ప్రతిజ్ఞ చేశారుకలెక్టర్ ప్రసంగంలో, “విద్యార్థులే దేశానికి వెన్నుముక, నేటి బాలలే రేపటి పౌరులు” అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి మత్తు పానీయాలు, మాదకద్రవ్యాల నుండి దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు.యువకులపై మత్తు పానీయాలు, మాదకద్రవ్యాల ప్రభావం వ్యక్తిగత జీవితంలో తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతాయని, కుటుంబం మరియు సమాజాన్ని కూడా దెబ్బతీస్తాయని కలెక్టర్ హెచ్చరించారు. విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిఎల్సీసి నాగ్ రాణి, ఏఎస్పీ చైతన్య రెడ్డి, ప్రమీల్, సంబంధిత జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు మరియు వివిధ విద్యాసంస్థల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా చేశారు.

## శాబ్దీపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిని పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్





**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త) :** జిల్లా కేంద్రంలోని శాబ్దీపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతిని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మంగళవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారుడు చింతల సుమలత శ్రీనివాస్ గృహ నిర్మాణ పనులను సందర్శించి, నిర్మాణ ప్రగతిపై లబ్ధిదారులతో మాట్లాడారు.కలెక్టర్ నిర్మాణ పనులు ఎలా కొనసాగుతున్నాయి, బ్యాంక్ రుణం ఎంత పొందారు, ఇప్పటి వరకు ఖర్చు ఎంత అయ్యింది, ఇసుక సరఫరా ఎలా ఉందీ, నిర్మాణానికి అవసరమైన ఇతర సౌకర్యాల లభ్యత వంటి కీలక అంశాలను విచారించారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన ప్రతి కుటుంబం తమ స్వగృహంలో త్వరగా ప్రవేశించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుడు సుమలత మాట్లాడుతూ, ?2 లక్షల రుణం పొందామని, స్లాబ్ పనులు పూర్తయ్యాయని, ప్రస్తుతం నిర్మాణం వేగవంతంగా కొనసాగుతోందని తెలిపారు.తదుపరి, కలెక్టర్ అధికారులు మరియు కాంట్రాక్టర్లను ఉద్దేశించి మేస్త్రీల సమావేశాలు నిర్వహించారా, ప్రస్తుత నిర్మాణ టార్గెట్ ఎంత, మంజూరు చేసిన ఇళ్ల సంఖ్య, రద్దు చేసిన ఇళ్ల వివరాలు మరియు కారణాలు, మార్క్‌వుట్ చేసిన ఇళ్ల సంఖ్య, మార్క్‌వుట్ అయినప్పటికీ ఇంకా నిర్మాణం ప్రారంభం కానివి ఎన్నిఅన్న అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని పారదర్శకంగా, వేగవంతంగా ముందుకు తీసుకెళ్లాలని సూచించిన కలెక్టర్, ఇసుక సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కూడా అన్నారు.ఈ పర్యటనలో పిడీ హౌసింగ్ విజయ్ పాల్ రెడ్డి, ఎంపిడిఓ, ఎంపీఓ, పంచాయితీ కార్యదర్శి అధికారులు పాల్గొన్నారు.


## “జల్ చంచాయ్-జల్ భగీ దారి”కి ఆదిలాబాద్ జిల్లాకు గుర్తింపు





**ఆదిలాబాద్, నవంబర్ 18,(%ణణ%9వార్త):** ఆదిలాబాద్ జిల్లాలో జల సంరక్షణ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేసినందుకు గుర్తింపుగా, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన “జల్ చంచాయ్ %-% జన్ భాగీధారీ” కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా సౌత్ జోన్‌లో మొదటి స్థానం సాధించింది. ఈ ప్రతి ష్ఠాత్మక అవార్డుతో పాటు రూపాయలు 2 కోట్ల నగదు ప్రోత్సాహాన్ని కేంద్రం ప్రకటించింది. ఈ సందర్భంగా కేంద్ర జనశక్తి మంత్రిత్వశాఖ -2025 గత సెప్టెంబర్ 26న సంబంధిత ఉత్తర్వులను జారీ చేసింది.ఈ నేపథ్యంలో మంగళవారం రోజు న్యూఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు.తెలంగాణ లోనిఆదిలాబాద్ జిల్లాకు లభించిన ఈ జాతీయ స్థాయి గుర్తింపు పట్ల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేశారు.

## ఘనంగా శ్రీ సాయి అయ్యప్ప మందిరం వార్షికోత్సవ వేడుకలు







**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త) :** కోటగిరి మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ సాయి అయ్యప్ప మందిరం మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా జరిగింది. ఈ ప్రత్యేక సందర్భంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యుడు పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అగ్రోస్ చైర్మన్ శ్రీ కాసుల బాలరాజు ప్రత్యేక ఆహ్వానిత అతిధులుగా పాల్గొన్నారు.వారు ప్రత్యేక పూజల్లో హాజరై మంగళప్రార్థనలు చేశారు. ఈ వేడుకకు కోటగిరి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ ప్రాంతాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పూజల అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి గీతాలు, హరినామ కీర్తనలతో మంగళ వేడుకకు ప్రత్యేక శోభ నింపాయి.ఈ ఘన వేడుకల ద్వారా శ్రీ సాయి అయ్యప్ప మందిరం స్థానిక ప్రజల ఆధ్యాత్మిక జీవనంలో ఒక ముఖ్య కేంద్రంగా నిలవనుంది.ఈకార్యక్రమంలో నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి నవజాత శిశు వారోత్సవాల ఓరియంటేషన్ కార్యక్రమం

**కామారెడ్డి,నవంబర్ 18(డిడి9 వార్త) :** మంగళవారం కామారెడ్డి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో జిల్లా స్థాయి నవజాత శిశు వారోత్సవాల 15%-%21 నవంబర్, 2025 భాగంగా ఓ ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం జిజిహెచ్ కామారెడ్డిలో నిర్వహించబడింది.కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వర్లు, ఆర్ఎమ్వో లు డా. రవీందర్ గౌడ్, డా.యాదగిరి,ఎన్ఎన్ఎఫ్ ఛైర్పర్సన్ డా. శ్రీశైలం, పీడియాట్రిషన్ విభాగం హెచ్ఓడి డా.కళ్యాణి శ్రీనివాస్ నేతృత్వంలో, జిల్లాకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు మరియు మెడికల్ కాలేజ్ విద్యార్థులు పాల్గొన్నారు.కార్యక్రమంలో నవజాత శిశువులను పుట్టిన వెంటనే





సంరక్షించే విధానాలు, తల్లిపాలను ప్రారంభించడం మరియు తల్లిపాల ప్రాముఖ్యత, అలాగే కంగారు మదర్ కేర్ విధానాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షకులు డా. లింగారెడ్డి, డా.చంద్రశేఖర్, డా.శ్రవణ్, డా.హిమజ్, డా.మౌనిక శిక్షణ పొందిన మెడికల్ ఆఫీసర్లు మరియు సూపర్వైజర్లు తమ సబ్-సెంటర్లలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్ఎమ్ లకు మరియు ఆశాలకు అవగాహన కల్పిస్తారు.తద్వారా నవజాత శిశు సంరక్షణకు మరింత గట్టి పునాది ఏర్పడుతుంది.

# 10 రోజుల్లో పంచాయతీ నోటిఫికేషన్



**హైదరాబాద్, నవంబర్ 18:** తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజాపాలన వారోత్సవాల అనంతరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గం సమావేశంలో డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు ప్రజాపాలన వారోత్సవాలు నిర్వహి ంచాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ వారోత్సవాల అనం తరం ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించి ంది. డిసెంబర్ రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పార్టీ పరంగా 42% రిజర్వేషన్లు కల్పిస్తూ.. గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయిం చింది. అయితే మొదట గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది ప్రభుత్వం. మార్చి 31లోపు 15వ ఆర్థిక సంఘం కాలపరిమితి ముగియనుం డడంతో అప్పటిలోగా ఎన్నికలు పూర్తి చేయాలని భావిస్తోంది. అలా కుదరకపోతే.. గ్రామాలకు రావాల్సిన దాదాపు రూ.3వేల కోట్ల నిధులు కోల్పోతామని భావిస్తోంది ప్రభుత్వం. బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించింది. పార్టీ పరంగానూ 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.దీనిలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేస్తోంది. మంత్రివర్గ సమావేశంలో గ్రామీణ పాలనను పునరుద్ధరించే దిశగా కీలక నిర్ణయాలు తీసుకోవడంతోపాటు.. అధికారులు దీనిపై కసరత్తు ముమ్మరం చేశారు.. అంతా సవ్యంగా జరిగితే.. వచ్చే పది రోజుల్లో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. డిసెంబర్ 15లోపు మొత్తం ప్రక్రియ పూర్తిచేయాలన్న లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్ధేశించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న 23% బీసీ రిజర్వేషన్లను మొత్తం రిజర్వేషన్లు 50%కు లోపే ఉండేలా గ్రామాల వారీగా పునర్విభజన చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేక కమిషన్‌కు రిజర్వేషన్ల ఖరారుపై ఆదేశాలు పంపనుంది. ఈ ప్రక్రియకు వారం రోజులు పట్టే అవకాశం ఉందని అంచనా. కమిషన్ నివేదిక వచ్చేనాటికి రెండు%-%మూడు రోజుల్లో నోటిఫికేషన్ వెలువడనుంది.పం చాయతీ ఎన్నికలు పార్టీ రహితం అయినప్పటికీ, పార్టీ తరఫున పోటీ చేసే సర్పంచ్, వార్డు సభ్యుల ఎంపికలో కనీసం 42% బీసీలను ఇవ్వాలని, అవసరమైతే 60% వరకు అవకాశమి వ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్చార్జ్‌లకు స్పష్టంగా తెలియజేయా లని ఆయన మంత్రులకు దిశానిర్దేశం చేశారు.ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఎన్నికలు పూర్తి చేయకపోతే గ్రామీణ సంస్థలకు కేటాయించాల్సిన రూ.3,000 కోట్ల ఆర్థిక సంఘ నిధులు కోల్పోయే ప్రమాదం ఉందన్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ వేగవం తమైన నిర్ణయం తీసుకుంది.సుప్రీం, హైకోర్టు మార్గదర్శ కాలతో.రిజర్వేషన్లలో 50% పరిమితిని దాటకూడదన్న హైకోర్టు, సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంగా ప్రత్యేక కమిషన్‌నే రిజర్వేషన్ల ఖరారుకు బాధ్యుల్ని చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 24న హైకోర్టు పరిశీలన అనంతరం వచ్చే క్యాబినెట్ సమావేశంలో మరిన్ని నిర్ణయాలు తీసుకోనున్నారు.డిసెంబర్ 8%-%9: తెలంగాణ గ్లోబల్ సమ్మిట్డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను విజయవంతం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీలో జరిగే ఈ సమ్మిట్ కోసం ప్రజాభవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. డిసెంబర్ మొదటి వారంలో జరగనున్న ప్రజాపాలనా విజయోత్సవాల ఏర్పాట్లను కూడా సమీక్షించారు.తదుపరి క్యాబినెట్ సమావేశం ఈ నెల 29న జరుగుతుంది. ఇందులో సమగ్ర విద్యుత్ విధానంపై ధీమామంత్రివర్గ సమావేశం అనంతరం మంత్రులు విడిగా సమావేశమై జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో వచ్చిన విజయంపై చర్చించారు. ఈ గెలుపు ప్రజలు ప్రభుత్వ పనితీరు పట్ల చూపించిన విశ్వాసానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. బీసీలు, ముస్లింలు, సెటిలర్ల ఓటు బ్యాంక్ పార్టీకి మరింత బలం ఇదే ఉత్సాహంతో రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ విజయం సాధించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు.

# కుట్ర చేసే బయటకు పంపారు



**ఖమ్మం, నవంబర్ 18:** కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకు పడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు.రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైం దన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేక పోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకా శం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయి ంచుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్య కర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు.కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వరావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మకమైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు.జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడించబోతున్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయకట్టు స్థిరీకరించి రైతాంగానికి సాగు నీరు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల భూమి వచ్చే వరకు వారి తరఫున పోరాడుతామని స్పష్టం చేశారు. తెలంగాణలో పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని.. సీసీఐతో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

# పత్తికి మద్దతు ధర ఇవ్వాల్సిందే



**వరంగల్, నవంబర్ 18:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికిమాజీ మంత్రి హరీష్ రావువార్నింగ్ ఇచ్చారు. పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే తెల్ల బంగారాన్ని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ముందు పోసి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. మంగళవారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం మాజీ మంత్రి మీడియాతో మాట్లాడుతూ... పత్తి కొనుగోళ్లు నిలిచిపో వడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీసీఐ తుగ్లక్ చర్యల వల్ల రైతులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు విధిలేక దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నిలువునా ముంచుతున్నాయని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రెడ్డి అరవై సార్లు ఢిల్లీకి వెళ్లారని.. మూటలు పంపుతున్నారు గానీ రైతుల సమస్యలు బడేబాయ్‌కు చెప్పరా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయో త్సవాలు జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫా నుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు.

# 200 రోజుల పాటు వారందరికీ ఫ్రీగా పాల పంపిణీ



**హైదరాబాద్, నవంబర్ 18:** తెలంగాణ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. మరీ ముఖ్యంగా చిన్నారులు, విద్యార్థుల కోసం అనేక సంస్కరణలు అమలు చేస్తోంది. అలానే గర్భవతులు, బాలింతలకు అంగన్వాడీ కేంద్రాల ద్వారా బలమైన పౌష్టికాహారం అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది. వీటితో పాటు రాష్ట్రంలో చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సరికొత్త కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. దీని ద్వారా 200 రోజుల పాటు ప్రీ స్కూల్ పిల్లలందరికీ ఉచితంగా పాలు పంపిణీ చేయనుంది. ఆ వివరాలు..తెలంగాణ రాష్ట్రంలో చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా ప్రీ స్కూల్ పిల్లలకు అంగన్వాడీ కేంద్రాల్లోనే ఉచితంగా పాలు పంపిణీ చేయాలని భావిస్తోంది. అంటే రాష్ట్రంలో 3-6 ఏళ్ల మధ్య వయస్సు గల చిన్నారులకు ఫ్రీగా పాలు పంపిణీ చేయనున్నారు. దీనిలో భాగంగా.. సంవత్సరంలో సుమారు 200 రోజుల పాటు రోజూ 100 మి.లీ 'విజయా డెయిరీ' పాలు పంపిణీ చేయాలంటూ.. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టర్ శ్రుతి ఓజా ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమం అమలు చేయడం కోసం తెలంగాణ ప్రభుత్వం.. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు.. లీటర్ 'విజయా డెయిరీ డబుల్ టోన్డ్ యూహెచ్‌టీ టెట్రా' పాల ప్యాకెట్లను పంపిణీ చేయనుంది. ఆ పాలను వేడి చేసి పంచదార లేదా బెల్లం కలిపి.. గోరు వెచ్చగా అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు అందించాల్సి ఉంటుంది. అయితే ముందుగా ములుగు జిల్లా కేంద్రంలో పైలట్ ప్రాజెక్టుగా దీన్ని అమలు చేస్తున్నారు. ఈ పథకంపై క్షేత్రస్థాయి ఉద్యోగులు, పిల్లల తల్లిదండ్రుల నుంచి అభిప్రాయం సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రంలో భాగంగా మంత్రి సీతక్క.. సోమవారం నాడు.. ములుగులోని కృష్ణ కాలనీ ప్రీ-స్కూల్ పిల్లలకు పాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని మంత్రి సీతక్క చెప్పారు. రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఇప్పటికే అనేక నిర్ణయాలు తీసుకున్నారని తెలిపారు. అలానే అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను సొంత వారిలా చూసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు.

# పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోయిన ఎస్ఐ.. మెదక్ జిల్లాలో సంచలన ఘటన




**టెక్మాల్, (మెదక్) నవంబర్ 18:** మెదక్ జిల్లా టేక్మాల్ పోలీస్ స్టేషన్లో ఒక వింతైన ఘటన చోటుచేసుకుంది. సాక్షాత్తూ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ తన పోలీస్ స్టేషన్ గోడ దూకి పారిపోయాడు. ఒక కేసుకు సంబంధించి రూ. 20వేలు లంచం తీసుకుంటుండగా, ఎస్ఐ రాజేష్ ఏసీబీకి పోలీస్ స్టేషన్లో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దీంతో అతడ్ని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్న సమయంలో అక్కడి నుంచి పరుగు లంకించుకున్నాడు. ఏసీబీ అధికారుల నుంచి తప్పించుకుని పోలీస్ స్టేషన్ నుంచి బయటకి పారిపోయాడు.దీంతో ఎస్ఐ రాజేష్‌ని వెంబడించి, చివరికి ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అయితే, ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. ఎస్సై రాజేష్ .. ఏసీబీకి చిక్కడంతో స్థానికులు సంబరాలు చేసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు పెద్ద సంఖ్యలో చేరుకున్న స్థానికులు.. పోలీస్ స్టేషన్ ముందు టపాసులు కాల్చారు..

# జుక్కల్‌లో యువజన కాంగ్రెస్ సమావేశం: ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు కీలక సూచనలు



**జుక్కల్,నవంబర్ 18(డిడి9 వార్త):** జుక్కల్ నియోజకవర్గం క్యాంప్ ఆఫీసులో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు యువజన కాంగ్రెస్ నాయకులకు దిశానిర్దేశం ఇచ్చారు. సమావేశానికి నియోజకవర్గ, మండలి, జిల్లా స్థాయి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యదర్శులు హాజరయ్యారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం స్పష్టమైన వ్యూహం అవసరమని, ప్రతి నాయకుడు ప్రజల్లోకి వెళ్లి పార్టీ బలం పెంచేలా పనిచేయాలన్నారు. అలాగే, యువజన కాంగ్రెస్ సమన్వయంతో జుక్కల్ నియోజకవర్గంలో మెజారిటీ స్థానాలు సాధ్యమని పేర్కొన్నారు. సమావేశం ముగిసిన తర్వాత యువజన కాంగ్రెస్ సభ్యులు ఉత్సాహంతో, ఆత్మవిశ్వాసంతో రాబోయే ఎన్నికల పట్ల తగిన ప్రణాళికతో ముందుకు సాగేందుకు సిద్ధమని తెలిపారు.

# ఎయిర్‌పోర్ట్ టెర్మినల్స్‌లో బ్లాస్ట్ జరుగుతుంది గుర్తుతెలియని వ్యక్తులు మెయిల్

**హైదరాబాద్, నవంబర్ 18:** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి తరచూ బాంబు బెదిరింపు కలకలం రేపుతోంది. బాంబు ఉన్నట్లు మెయిల్ రావడంతో విమానాశ్రయ సిబ్బంది అలర్ట్ అయి తనిఖీలు చేయడం.. ఆ తరువాత అవి ఫేక్ అని తేలడం జరుగుతూనే ఉంది. అయితే ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు వార్తలతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పుడు తాజాగా మరోసారి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు రావడంతో విమానాశ్రయ సిబ్బంది అప్రమత్తమయ్యారు.(మంగళవారం) ఉదయం 10:05 గంటలకు ఎయిర్‌పోర్టులో బాంబు ఉన్నట్లుగా మెయిల్ వచ్చింది. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్స్‌లో బ్లాస్ట్ జరుగుతుందని ప్రయాణికులను వెంటనే ఖాళీ చేయాలని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు మెయిల్‌లో హెచ్చరించారు. కసబ్‌ను మైనర్‌గా విచారణ చేయకుండానే ఉరి తీశారని మెయిల్‌లో రాశారు. ఈరోజు ఆపరేషన్ కోసం లాజిస్టిక్స్ సిద్ధం చేయడానికి 3 నెలలు పట్టిందని మెయిల్ సారాంశం.హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌లో ఉన్న ముస్లింలు, మహిళలు, పిల్లలను ఖాళీ చేయాలని కోరుతూ మెయిల్ పంపారు. దీంతో విమానాశ్రయ సిబ్బంది అప్రమత్తమయ్యారు. వెంటనే ఎయిర్‌పోర్టులో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మెయిల్ ఎవరు పంపారు?.. ఎక్కడి నుంచి వచ్చింది అనే దానిపై కూడా విమానాశ్రయ సిబ్బంది ఆరా తీసే పనిలో ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది

**గంగాధర, నవంబర్ 18 :** ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను దోపిడీ చేస్తుందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం వెంకంపల్లిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వినోద్ కుమార్ మాట్లాడుతూ దళారుల బెడదను నివారించి, మద్దతు ధర అందించడం కోసం నాడు కేసీఆర్ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని గుర్తు చేశారు.ప్రభుత్వమే నేరుగా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి, వారం రోజుల్లోనే బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసిందన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా రైతులు ఇబ్బంది పడకుండా పకడ్బందీగా కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, ప్రభుత్వం, రైస్ మిల్లర్ల ఇబ్బందితో రైతులు ప్రైవేటు వ్యక్తులకు ధాన్యం అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నారని దుయ్యబట్టారు.ప్రభుత్వ కొనుగోళు కేంద్రంలో ధాన్యం తూకం వేసే సమయంలోనే తరుగు పేరుతో బస్తాకు అదనంగా రెండున్నర కిలోలు తూకం వేస్తుందన్నారు. మిల్లులకు తరలించిన తర్వాత వెయిట్ లాస్ పేరుతో వారికి పది బస్తాల వరకు కట్ చేసి రైతులను దోపిడీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు.

# బ్రిలియంట్ కాలేజీలో రూ. 1.07 కోట్ల చోరీ

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగర శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజినీరింగ్ కాలేజీలో రూ. 1.07 కోట్ల నగదు చోరీకి గురైన సంగతి తెలిసిందే. ఈ కేసులో నెల రోజుల తర్వాత ముగ్గురు దొంగలు పట్టుబడ్డారు. ఈ ముగ్గురిలో ఒకరు మైనర్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.మంగళవారం ఉదయం కొత్తగూడ ఎక్స్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పద కదలికలతో తిరుగుతున్న రాజ్ మనోహర్ పవార్(22), రితిక్ మోహితే(24), 16 ఏండ్ల బాలుడు ఉన్నారు. మరో ముగ్గురు దినేశ్ మెహితే, అరుణ్ మోహితే అలియాస్ కలూ, విలాస్ చోహన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. రాజ్ మనోహర్‌ది గుజరాత్, రితిక్‌ది మధ్యప్రదేశ్ అని పోలీసులు తేల్చారు. రితిక్ న్యాయ విద్య అభ్యసిస్తున్నట్లు తేలింది.ఈ దోపిడీ గ్యాంగ్ నగర శివార్లలోని కాలేజీలపై కన్నేసింది.

# భారత్‌కు తలనొప్పిగా బంగ్లా పరిణామాలు !

ఏదేశాన్ని తిన్నగా బతకనీయకుండా ఆటలాడడం అమెరికాకు అలవాటుగా మారింది. అన్ని దేశాలపైనా ఆంక్షలు విధించడం, మోయలేని సుంకాలు విధించడం, బెదిరించడం పరిపాటిగా మారింది. తాజాగా రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తే, 500 శాతం పన్నులు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. ప్రపంచ దేశాలన్నీ తన కనుసన్నల్లో ఉండాలన్న కోరిక అమెరికాలో బలంగా నాటుకుంటోంది. అందుకు అవసరమైన అన్ని కుయుక్తులు పన్నుతోంది. ఒక్కో దేశంలో వేలుపెడుతూ వాటిని కంట్రోల్ చేస్తోంది. ఇజ్రాయిల్‌ను అడ్డం పెట్టుకుని పాలస్తీనాపై దాడికి తెగించింది. ఇరాన్, ఖతార్‌లపైనా విరుచుకు పడింది. అలాంటి అవకాశం లేని చోట్ల రాజకీయంగా వేలుపెట్టి అక్కడున్న పాలకులను మార్చేస్తోంది. ఒక్క భారత్‌లోనే అది సాధ్యం కావడం లేదు. చైనాలో అస్సలు సాధ్యం కాదు. భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం కావడం, విభిన్న మతాలు, కులాల సమాహారం కావడంతో ఇక్కడ దాని పప్పులు ఉడకలేదు. ఇక్కడా రకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. ఇటీవలి వరుస ఆందోళనలు చూస్తుంటే సిఐఎ బాగా పని చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. మన పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వాన్ని గద్దె దించడంలో పరోక్షంగా అమెరికా పాత్ర ఉంది. అలాగే పాక్‌ను మరోమారు దువ్వుతున్నారు. నేపాల్‌లో గొడవలు సృష్టించారు. భారత్‌ను దెబ్బతీసేందుకు చుట్టుపక్కల దేశాల్లో అలజడులు సృష్టిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లపై ఆంక్షలు విధించారు. వీసాల విషయంలో అనేక రకాల నిబంధలను పెట్టారు. బంగ్లాదేశ్‌నే తీసుకుంటే అక్కడా అలజడుల వెనక అమెరికా హస్తం ఉందని అంతర్జాతీయ నిపుణులు ఆరోపిస్తున్నారు. ఇతరదేశాల్లో వేలు పెట్టడం వల్ల తాము చాలా నష్టపోయామని అమెరికా ఇంటిలిజెన్స్ చీఫ్ తులసీగబ్బార్ ఆమధ్య అంగీకరించారు. అయినా వెనకటి గుణమేల మారు అన్న చందంగా అమెరికా పరిస్థితి ఉంది. బంగాదేశ్‌లనే తీసుకుంటే అక్కడ హసీనాను గద్దె దించడం, యూనస్‌ను గద్దెనెక్కించడం చకచకా జరిగి పోయాయి. ఇప్పుడు హసీనాకు ఉరిశిక్షను కూడా విధించారు. దాదాపు రెండు దశాబ్దాల క్రితం రసాయన ఆయుధాల పేరుతో ఇరాక్‌పై దాడిచేసి అక్కడ సద్దాం హుస్సేన్ ప్రభుత్వాన్ని అమెరికా గద్దె దింపింది. అలాగే సద్దాంను విచారణ పేరుతో బంధించి ఉరితీసే వరకు నిద్రపోలేదు. సరిగ్గా ఇప్పుడు బంగ్లాదేశ్‌లో జరుగుతున్న తీరు కూడా ఇరాక్‌ను పోలివుంది. హసీనా భారత్‌కు అనుకూలంగా ఉండడాన్ని అమెరికా జీర్ణించుకోవడం లేదని అర్థం అవుతోంది. అందుకే ఆమెను పదవీచ్యుతురాలిని చేశాక భారత్‌లో ఆశ్రయం పొందారు. ఇప్పుడు బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా మరణశిక్షకు అర్హురాలని అక్కడి ట్రిబ్యునల్ నిర్ణయించింది. ముగ్గురు సభ్యుల ఈ ట్రిబ్యునల్ హసీనా ఎన్నో దుర్మార్గాలకు పాల్పడిందని ఏకరువు పెట్టింది. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్నవారిని కాల్చిపారేయమని ఆమె ఆదేశించారని, డ్రోన్లు, హెలికాప్టర్లు ఉపయోగించి మరీ నిరసనకారులపై మారణాయుధాలతో విరుచుకుపడమని భద్రతాబలగాలను ఒత్తిడిచేశారని న్యాయమూర్తులు తేల్చారు. అధికారంలో కొనసాగడానికి అత్యంత అమానుషంగా ప్రవర్తించా రంటూ, తీవ్రంగా గాయపడిన నిరసనకారులను సకాలంలో ఆస్పత్రికి తరలించడానికి కూడా భద్రతాదళాలు నిరాకరించాయని న్యాయమూర్తులు ప్రకటించారు.



తీర్పు ఇవ్వడంలో జాప్యం జరిగినందుకు క్షమించమని కూడా ఒక న్యాయమూర్తి అన్నారు. తీర్పు వెలువడగానే, యూనిస్ ప్రభుత్వం హసీనాను తమకు అప్పగించమని డిమాండ్ చేయడం చూస్తూనే ఉన్నాం. ట్రిబ్యునల్ తీర్పు ఎలా రాబోతున్నదో ఊహకు అందనిదేమీ కాదు. సరిగ్గా యాభైయేళ్ళక్రితం జరిగిన సైనిక కుట్రలో తండ్రి, తల్లి, ముగ్గురు సోదరులను కోల్పోయి, ఆరేళ్ళపాటు భారత్‌లో ఇందిర నీడన తలదాచుకొని, తిరిగి స్వదేశంలో కాలూని అధికారాన్ని చేజిక్కించుకున్న హసీనా గతం ఇప్పుడు అందరికీ గుర్తుకువస్తోంది. జియావుర్ రహ్మాన్ భార్య ఖలీదాజియామీద అలుపెరగని, సాహసోపేత పోరాటాలు చేశారు. ఇద్దరు బేగంల మధ్య సాగిన ఆధిపత్య పోరాటంలో ముజబూర్ రహ్మాన్ కుమార్తె పైచేయి సాధించారు. ఖలీదా సహా బీఎన్పీ అధినాయకుల నిర్బంధాలు, ఆ పార్టీకి అండగా ఉన్న జమాతే వంటే ఇస్లామిక్ ఛాందసశక్తులను అధికారికంగానూ, అనధికారికగానూ హసీనా చీల్చిచెండాడారు. హసీనా పాలనలో బంగ్లాదేశ్ వేగంగా వృద్ధిచెందింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తయ్యాయి, పేదరిక నిర్మూలనలోనూ మంచిపేరు తెచ్చుకుంది. తనకు వ్యతిరేకంగా సాగిన విద్యార్థి ఉద్యమంపట్ల హసీనా నిర్దయగా వ్యవహరించారన్నదీ వాస్తవమే. ఆ తరువాత ఆమె దిగివచ్చినా, అప్పటికే పరిస్థితి చేజారింది. రిజర్వేషన్ వ్యతిరేక ఉద్యమం తన లక్ష్యాన్ని సాధించు కున్న తరువాత నిజానికి చల్లారినా, స్వల్పకాలంలోనే తిరిగి రాజుకోవడం వెనుక జమాత్ ఇస్లామీ, బీఎన్పీ ఉండటంతో ఆమె కఠినంగా వ్యవహరించాల్సి వచ్చిందని అంటారు. పాకిస్థాన్ ఒత్తిడి కారణంగా అమెరికా, దాని మిత్రదేశాలు కొన్ని ఆమెకు పూర్తి వ్యతిరేకంగా వ్యహరించాయి. ఆమె ఢిల్లీ పారిపోయి వచ్చిన తరువాత, బంగ్లాదేశ్‌లో అప్పటినుంచి ఇప్పటివరకూ సాగిన పరిణామాలన్నీ ఆమె పట్ల ఏయే శక్తులు ఏ లక్ష్యాల సాధనకోసం కత్తికట్టాయో తెలియచెబుతాయి. గృహనిర్బంధంలో ఉన్న ఖలీదా విదేశీ చికిత్సతో ఎన్నికలకు సిద్ధపడటం, వేలాదిమంది జమాత్ యోధులు జైళ్ళ నుంచి బయటకు రావడం, ముజబూర్ రహ్మాన్ విగ్రహాలను మాత్రమే కాదు, ఆయన ఆధ్వర్యంలో సాగిన విముక్తి పోరాటాన్ని సైతం చరిత్ర నుంచి చెరిపేసి, అప్పట్లో ఊచకోతకోసిన పాకిస్థాన్‌ను ఘనంగా ఊరేగించడం చూస్తూనే ఉన్నాం. ఓ రకంగా పాకిస్థాన్ ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిది. ఇలా భారత్‌కు వ్యతిరేకంగా పాక్‌ను, బంగ్లాదేశ్‌ను ఎగదోయడం వెనక ఎవరున్నారన్నది వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఇప్పటికే పలుమార్లు ఆమె అప్పగిం చాలని యూనిస్ ప్రభుత్వం కోరుతూ వచ్చింది. ఇప్పుడు ఉరిశిక్ష విధించారు. కనుక భారత్ మీద ఒత్తిడి పెంచేందుకు ఇప్పుడు మరో ఆయుధం చేతికి అందివచ్చింది.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

**ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత హిడ్మా హతం**

**ఎదురుకాల్పుల్లో మొత్తం ఆరుగురు మావోల హతం**

**మారేడుమిల్లి,నవంబర్18:** మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొంగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకుఅనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు.



ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు

# తుమ్మల లాంటి నేతలను వదులుకోవడం తప్పే...

**అందుకే బిఆర్ఎస్ మూడోసారి మట్టి కరిచింది**

**తెలంగాణలో ప్రతిపక్షం అన్నింటా ఫెయిల్**

**ఇప్పడా బాధ్యతను జాగృతి పోషిస్తుంది**

**ఖమ్మంలో మీడియాతో కవిత సంచలన వ్యాఖ్యలు**

**ఖమ్మం,నవంబర్18:** రాష్ట్రంలో అధికార పక్షం, ప్రతిపక్షం బాధ్యతగా వ్యవహరించటంలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత విమర్శించారు. ఖమ్మం జిల్లాకు చెందిన బలమైన నేత తుమ్మల నాగేశ్వరావును బీఆర్ఎస్ వదులుకోవడంతోనే మూడోసారి అధికారంలోకి రాకుండా పోయిందంటూ వ్యాఖ్యలు చేశారు. తుమ్మల బయటకు వెళ్లడంతోనే రాష్ట్రంలో గులాబీ పార్టీ పరిస్థితి తలకిందులైందన్నారు. తుమ్మల లాంటి నేతను బీఆర్ఎస్ వదులుకోవడం నూటికి నూరు శాతం పెద్ద తప్పే అని అన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం ఫెయిల్ అయ్యిందని.. తన బాధ్యతను నిర్వర్తించలేకపోతోందని వ్యాఖ్యలు చేశారు. బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్రను భవిష్యత్తులో తాము పోషించబోతున్నామన్నారు. కొత్త రాజకీయ పార్టీ గురించి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీపై విరుచుకుపడ్డారు. తనను ఏ విధంగా పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాన్ని తెలియజేశారు. రాజకీయ పార్టీ గురించి ఇప్పుడప్పుడే ఆలోచన చేయటం లేదని కవిత అన్నారు. బీఆర్ఎస్‌లో నుంచి తనను సస్పెండ్ చేశారని.. ఆ పార్టీతో తనకెటువంటి సంబంధాలు లేవని స్పష్టం చేశారు. కుట్రతో బీఆర్ఎస్ నుంచి తనను బయటికి పంపించారంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది కుట్ర చేసి తనను.. తన కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీకి దూరం చేశారన్నారు. తన జీవితంలో చిన్న పొరపాటు కూడా చేయలేదన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తనకు ఎక్కడా ఎటువంటి అవకాశం ఇవ్వలేదని.. కనీసం ఒక టీచర్ పోస్ట్ కూడా ట్రాన్స్ఫర్ చేయించుకోలేకపోయానని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్‌లో జాగృతి కార్యకర్తలకు అన్యాయం చేశారని... కనీస గుర్తింపు ఇవ్వలేదని కవిత సంచలన కామెంట్స్ చేశారు. కవిత ఇంకా మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి ఊపిరులు ఊదిన జిల్లా ఖమ్మం జిల్లా అని జాగృతి అధ్యక్షురాలు అన్నారు. జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఖమ్మం జిల్లా పూర్తిగా మారిపోయిందని గుర్తుచేశారు. వెంగళరావు హయాంలో జిల్లా విశేషంగా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తరువాత పెద్దలు తుమ్మల నాగేశ్వ రావు ఖమ్మం జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని తెలిపారు. ఇప్పుడు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఖమ్మం అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని చెప్పారు. ఖమ్మం అభివృద్ధి కోసం ఎవరి ప్రయత్నం



వారు చేసినప్పటికీ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెంద లేదని అన్నారు. ఇంకా ఖమ్మం అభివృద్ధి చెందాల్సి ఉందని.. సీతారామ ప్రాజెక్టును కూడా వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ రావాలన్నదే తన ఆశయమని.. అవకాశం, అధికారం, ఆత్మగౌరవం కోసమే తన పోరాటమని కవిత స్పష్టం చేశారు. గ్రామస్థాయి నుంచి విప్లవాత్మక మైన మార్పులు రావాలని.. అన్ని వర్గాలకు అధికారం అందాలని ఆకాంక్షించారు. బీసీలకు భిక్షం వేయొద్దని.. బిక్షం వేస్తే తీసుకోవడానికి వాళ్ళు బిచ్చగాళ్ళు కాదన్నారు. బీసీల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో దొంగ దీక్షలు చేసిందని విమర్శించారు. రేవంత్ రెడ్డి బీసీల ద్రోహిగా మిగిలిపోతారని.. నూటికి నూరు శాతం బీసీలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేయాలని డిమాండ్ చేశారు. జమలాపురం టెంపుల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క జమలాపురం ఆలయంపై దృష్టిపెట్టాలని డిమాండ్ చేశారు. పాతర్లపాడులో సామినేని రామారావు దారుణ హత్యకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. రామారావు హత్యపై డీజీపీని కలువనున్నట్లు కవిత తెలిపారు. హత్యా రాజకీయాలు సరికాదన్నారు. రేపు (బుధవారం) హైదరాబాద్‌లో సింగరేణి కార్మికుల సమస్యలపై సింగరేణి భవన్‌ను ముట్టడించబోతు న్నామని ప్రకటించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి, కొత్తగూడెం, మహబూబాద్ జిల్లాలకు న్యా యం జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీతారామ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి ఆయ

# క్రమంగా తగ్గుతున్న బంగారం ధరలు

**● రూ.1.25 లక్షల వద్ద కొనసాగుతున్న తులం రేటు**



**హైదరాబాద్,నవంబర్18:** దేశీయంగా పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలుతగ్గుముఖం పట్టాయి. మంగళవారం మధ్యాహ్నం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.25 లక్షలు పలుకుతోంది. అదే సమయంలో 22 క్యారెట్ల బంగారం రూ.1.14 లక్షల వద్ద కొనసాగుతోంది. అటు వెండి ధర సైతం కిలో రూ.1.56 లక్షలుగా ఉంది. అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా బంగారం ధరలు ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. ఈనెల 13వ తేదీన 10 గ్రాముల పసిడి రూ.1.30 లక్షల వద్ద ఉంది. ఐదు రోజుల వ్యవధిలో రూ.5వేల మేర తగ్గింది. వెండి కిలో రూ.1.70 లక్షలు ఉండేది. అప్పటితో పోలిస్తే దాదాపు రూ.15వేలు తగ్గింది. అప్పట్లో అంతర్జాతీయంగా ఔన్సు బంగారం 4200 డాలర్లుగా ఉండగా.. ఇప్పుడు 4010 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. వెండి ప్రస్తుతం ఔన్సు 49 డాలర్లుగా ఉంది. ఈ ధరలను అనుసరించి దేశీయంగానూ ధరలు తగ్గుముఖం పట్టాయి. సాధారణంగా బంగారానికి, అమెరికాలోని వడ్డీ రేట్లకు విలోమ సంబంధం ఉంటుంది. ఫెడ్ వడ్డీ రేట్లు పెంచినప్పుడు బంగారం ధర పడుతుంది. తగ్గినప్పుడు పెరుగుతుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం అమెరికా డాలర్ బలపడటం, వచ్చే నెల ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు క్షీణించడంతో పసిడికి డిమాండ్ తగ్గింది. దీనికితోడు డాలర్ ఇండెక్స్ బలపడడమూ మరో కారణమని అనలిస్టులు పేర్కొంటున్నారు. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగిసిన నేపథ్యంలో కీలక ఎకనామిక్ డేటా ఈ వారం వెలువడనుంది. ఫెడ్ గత మీటింగ్‌కు సంబంధించిన మినిట్స్, సెప్టెంబర్ నెలకు సంబంధించి జాబ్స్ డేటా ఈ బుధ, గురువారాల్లో వెలువడనుంది.

# భారీ ఎన్‌కౌంటర్ వెలుగులోకి కీలక విషయాలు



**అల్లూరి జిల్లా:** మారేడుమిల్లి అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌పై ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ మహేష్ చంద్రా లడ్డా వివరాలు వెల్లడించారు. ఈరోజు తెల్లవారుజామున 5 నుంచి 6 గంటల మధ్య భద్రతా బలగాలు మావోయిస్టులతో ఎదురుకాల్పులు జరిపాయని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఆయన వెల్లడించారు. మృతుల్లో మావోయిస్టుల కీలక నేత హిడ్మా, అతని సతీమణి, మరొక నలుగురు మావోయిస్టులు ఉన్నారని తెలిపారు. మరో ఐదుగురు మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకున్నారని చెప్పారు. ఇటీవల మావోయిస్టులకు సహకరిస్తున్న 31 మందిని అదుపులోకి తీసుకున్నామని, ఇంకా మరో 26 మందిని అదుపులోకి తీసుకోవాల్సి ఉందని అడిషనల్ డీజీ తెలిపారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టులు ఛత్తీస్‌ఘడ్‌కు చెందినవారని గుర్తించామని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందిస్తున్నామని వెల్లడించారు.

# రాప్తాడుకు బంగారు భవిష్యత్తు




**రాప్తాడు(అనంతపురం):** రేమండ్స్ పరిశ్రమ రాకతో రాప్తాడు భవిష్యత్తుకు బంగారు బాటలు పడ్డాయని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. జాకీ పరిశ్రమ స్థానంలో రేమండ్స్ వస్త్ర పరిశ్రమ మంజూరు చేసిన నేపథ్యంలో సోమవారం రాప్తాడు సమీపంలో పరిశ్రమ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞత సభ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు అంజనప్ప, ధర్మవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరయ్యారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతూ థ్యాంకు సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో సీఎం చంద్రబాబు సహకారంతో రాప్తాడులో జాకీ పరిశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. వైసీపీ ప్రభుత్వం దాన్ని విస్మరించిందన్నారు. అప్పటి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాషరెడ్డి, అతడి సోదరుల వసూళ్ల ప్రయత్నం కారణంగా జాకీ రాప్తాడును వదిలిపోయిందన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రాగానే అదే కంపెనీ లేక ఇతర కంపెనీలను తీసుకొస్తామని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేశామన్నారు. ఆ మేరకు ప్రముఖ వస్త్ర కంపెనీ రేమండ్స్ రూ.497కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిందన్నారు. పరిశ్రమ ఏర్పాటైతే 4వేల మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఏపీలో హై అలర్ట్ ఏలూరులో 15 మంది మావోయిస్టు అరెస్టు!



**కాకినాడ జిల్లా :** వోయిస్టుల కదలికలతో ఏపీలో హై అలర్ట్ కొనసాగుతోంది. అడవిలో నుంచి ఏపీకి వచ్చిన మావోయిస్టుల కోసం భద్రతాబలగాల గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే విజయవాడలో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేసిన పోలీసులు.. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే కాకినాడ జిల్లా కొప్పవరంలో ఇద్దరు మావోయిస్టులను అరెస్టుచేశారు. అలాగే ఏలూరులో 15 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అల్లూరి జిల్లాలో మంగళవారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక ప్రకటన చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని పరిణామాలతో మావోయిస్టులు ఏపీకి రావాలని చూస్తున్నారని మహేశ్ చంద్ర తెలిపారు. మావోయిస్టు కార్యకలాపాలపై నిఘా ఉంచామని పేర్కొన్నారు. మావోయిస్టుల కదలికలపై ఇంటెలిజెన్స్ నుంచి రెండు రోజుల క్రితం పక్కా సమాచారం వచ్చిందని చెప్పారు. మావోయిస్టులు ఏపీ నుంచి కార్యకలాపాలను తిరిగి ప్రారంభించాలని చూశారని వెల్లడించారు. ఈ క్రమంలోనే మంగళవారం ఉదయం 6.30-7.00 గంటల మధ్య భద్రతాబలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణి సహా ఆరుగురు మావోయిస్టులు మరణించారని పేర్కొన్నారు. అలాగే ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో 31 మంది మావోయిస్టులను అరెస్టు చేశామని మహేశ్ చంద్ర తెలిపారు. అరెస్టయిన వారిలో 9 మంది మావోయిస్టులు కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్‌జీ అనుచరులుగా వెల్లడించారు. మిగిలినవారంతా సౌత్ బస్తర్ జోనల్ కమిటీ సభ్యులు అని

# వైకుంఠ ద్వార దర్శనంపై టీటీడీ కీలక నిర్ణయం



**తిరుమల :** శ్రీవారి భక్తులకు గుడ్‌న్యూస్.. వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా డిసెంబర్ 30వ తేదీ నుంచి పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. ఈసారి సామాన్య భక్తులకే అధిక ప్రాధాన్యత కల్పించినట్లు స్పష్టం చేశారు. వైకుంఠ ద్వార దర్శనానికి పది రోజుల్లో 182 గంటల దర్శన సమయం ఉండగా.. అందులో 164 గంటలు సాధారణ భక్తులకే ప్రత్యేకంగా కేటాయించినట్లు టీటీడీ తెలిపారు. మొదటి మూడు రోజుల పాటు రూ.300, శ్రీవాణి దర్శనాలు రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు 15 వేల రూ.300 దర్శన టికెట్లు, వెయ్యి శ్రీవాణి దర్శన టికెట్లను రెగ్యులర్ పద్ధతిలో కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఇక తొలి మూడు రోజులు ( డిసెంబర్ 30, 31, జనవరి 1వ తేదీ) ఈ డిప్ ద్వారా దర్శనాలకు అనుమతించనున్నారు. ఈ టికెట్లకు సంబంధించిన నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ అవకాశం కల్పించనున్నారు. డిసెంబర్ 2వ తేదీన లాటరీ విధానంలో ఎంపికైన వారికి టోకెన్లు జారీ చేస్తారు. స్థానికుల కోసం కూడా ఈసారి ప్రత్యేక కేటాయింపులు చేశారు. జనవరి 6, 7, 8వ తేదీల్లో రోజుకు 5వేల టోకెన్లు కేటాయించనున్నారు. వైకుంఠ ద్వార నేపథ్యంల రోజుల పాటు వీఐపీ బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శనం రద్దు చేసినట్లు టీటీడీ తెలిపింది..

# బిహార్‌కు సీఎం చంద్రబాబు, లోకేశ్



**అమరావతి, నవంబర్ 18:** బిహార్ ముఖ్యమంత్రిగా నితీశ్ కుమార్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అందుకు ముహూర్తం ఖరారు అయింది. సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్‌లకు ఆహ్వానం అందింది. నవంబర్ 20వ తేదీన వీరు బిహార్ వెళ్లనున్నారు. బిహార్ రాజధాని పాట్నాలో జరిగే సీఎం నితీశ్ కుమార్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సీఎం చంద్రబాబుతోపాటు మంత్రి నారా లోకేశ్ హాజరుకానున్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే తరఫున ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆ రాష్ట్ర పారిశ్రామికవేత్తలతో ఏర్పాటు చేసిన పలు సమావేశాల్లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సంబంధించిన వివరాలను బిహార్‌లోని పారిశ్రామికవేత్తలకు మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా వివరించారు. 243 అసెంబ్లీ స్థానాలు ఉన్న బిహార్ అసెంబ్లీకి రెండు విడతలుగా.. నవంబర్ 6, 11 తేదీల్లో పోలింగ్ నిర్వహించారు. ఈ ఎన్నికల ఫలితాలను నవంబర్ 14వ తేదీన లెక్కించారు. ఈ ఎన్నికల్లో బిహార్ ఓటరు ఎన్డీయేకు వరుసగా మరోసారి పట్టం కట్టాడు. జేడీ (యూ) అధినేత నితీశ్ కుమార్ మరోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. అందుకోసం రాజధాని పాట్నాలో ఏర్పాట్లు చకచకా సాగుతు న్నాయి. ఈ సీఎం నితీశ్ ప్రమాణ స్వీకార కార్యక్ర మా నికి.. ఎన్డీయే భాగస్వామ్య పక్షాల పార్టీల అధినేతలు, మిత్రపక్షాలతోపాటు దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతోపాటు ఆయన కేబినెట్ సహచరులంతా హాజరువుతారని సమాచారం. సీఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి భారీ ఎత్తున ప్రముఖులు వస్తుండడంతో.. పాట్నాలో భారీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# విజయవాడలో కలకలం 28 మంది మావోయిస్టుల అరెస్ట్



**విజయవాడ:** ఆంధ్రప్రదేశ్‌లో చాలాకాలం తర్వాత మావోయిస్టుల అలజడి రేగింది. ఆపరేషన్ కగార్‌తో వరుస ఎన్ కౌంటర్లు, అగ్రనేతల మృతితో ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చారన్న సమాచారంతో కొంతకాలంగా పోలీసులు నిఘా పెట్టారు. మావోయిస్టులు ఉన్నారన్న పక్కా సమాచారంతో విజయవాడ, కాకినాడ నగరాల్లో సోదాలు నిర్వహించారు. ఇప్పటి వరకు 31 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేష్‌చంద్ర లడ్డా తెలిపారు. విజయవాడ న్యూ ఆటోనగర్‌ను మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా మార్చుకున్నారన్న పక్కా సమాచారంతో ఈ ఉదయం నుంచి కేంద్ర బలగాలు, ఆక్టోపస్, స్థానిక పోలీసులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. దాదాపు రెండు, మూడు బస్సుల్లో పోలీసుల బలగాలు వచ్చిన ఈ ప్రాంతాన్ని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. నాలుగు అంతస్తుల భవనాన్ని పోలీసులు చుట్టుముట్టారు. చుట్టుపక్కల ఉన్న దుకాణాలు, పరిశ్రమలను మూసివేసి తనిఖీలు చేపట్టారు. సోదాల్లో 28 మంది మావోయిస్టులను అరెస్ట్ చేశారు. వీరంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారిగా పోలీసులు చెబుతున్నారు. నలుగురు కీలక నేతలు ఉన్నట్లు చెబుతున్నారు. మావోయిస్టుల్లో 12 మంది మహిళలు కూడా ఉన్నారు. మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా ఏపీ : ఛత్తీస్‌గఢ్‌లో పెద్దఎత్తున జరుగుతున్న కూంబింగ్‌తో అక్కడి నుంచి మావోయిస్టులు షెల్టర్ జోన్‌గా ఏపీకి వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో విజయవాడ లాంటి నగరాల్లో మావోయిస్టుల అలజడి గతంలో ఎన్నడూ లేదు. అందుకే ఎవరికి అనుమానం రాదనే ఉద్దేశంతో ఇక్కడ షెల్టర్ జోన్ ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆటోనగర్‌లో చాలా మంది వలస కూలీలు వచ్చి కర్మాగారాల్లో పనిచేస్తుంటారు. ప్రత్యేకంగా బిహార్, ఛత్తీస్‌గఢ్ నుంచి ఇక్కడి వస్తున్నందున ఎవరికీ అనుమానం రాదని అందుకే దీన్ని సురక్షిత ప్రాంతంగా భావించినట్లు తెలుస్తోంది. గత కొద్ది కాలంగా వీరు ఇక్కడ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఇక్కడ షెల్టర్ జోన్ ఎవరు ఇచ్చారు. మావోయిస్టులకు ఎవరైనా సానుభూతిపరులు ఉన్నారా అనే కోణంలోనూ పోలీసులు ఆరా తీస్తున్నారు. మావోయిస్టులు 4 చోట్ల డంప్‌లు ఏర్పాటు చేశారన్న సమాచారంతో పోలీసులు గాలిస్తున్నారు. డంప్‌ల స్వాధీనం కోసం గాలిస్తున్నారు."మారేడుమిల్లి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు చనిపోయారు. కృష్ణా జిల్లా, విజయవాడ, కాకినాడలో మావోయిస్టులను అరెస్టు చేశాం. మొత్తం 31 మంది మావోయిస్టులను అరెస్టు చేశాం. అరెస్టైన వారిలో 9 మంది సెంట్రల్ కమిటీ సభ్యులు ఉన్నారు. ఈరోజు ఉదయం 6.30 నుంచి 7 గంటల సమయంలో ఎన్‌కౌంటర్ జరిగింది. రెండ్రోజులుగా ఇంటెలిజెన్స్ సమాచారంతో గాలింపు చర్యలు విస్తృతం చేశాం." -ఇంటెలిజెన్స్ ఏడీజీ మహేష్ చంద్ర లడ్డాఅల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎన్?కౌంటర్? : అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఇందులో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్రనేత హిడ్మా అలియాస్? సంతోష్?, ఆయన భార్య రాజీ అలాగే చెల్లూరి నారాయణ అలియాస్? సురేశ్?, టెక్ శంకర్, మల్లా, దేవే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

# హైదరాబాద్‌లో వైసీపీ కీలక నేత అరెస్ట్



**హైదరాబాద్:** హైదరాబాద్ లో ఏపీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అరెస్ట్ అయ్యారు. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకట్‌రెడ్డిని తాడిపత్రి పోలీసులు అరెస్ట్ చేసి తీసుకెళ్లారు. ఆయన్ను హైదరాబాద్ నుంచి ఏపీకి తరలిస్తున్నారు. ఏపీలో వెంకట్‌రెడ్డిపై పలు కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఈ నెల 14న తిరుమల పరకామణి కేసులో ఫిర్యాదుదారు, టీటీడీ మాజీ విజిలెన్స్ అధికారి సతీశ్‌కుమార్ అనుమానాస్పద మృతి కలకలం రేపింది. అనంతపురం తాడిపత్రి సమీపంలో రైల్వేట్రాక్ పక్కన అనుమానాస్పద స్థితిలో ఆయన మృతదేహం కనిపించింది.. ఆయన హత్యకు గురయ్యారని పోలీసులు చెబుతున్నారు. సతీశ్ కుమార్ కేసులో ఏపీ పోలీసుల దర్యాప్తు చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరు వెంకట్‌రెడ్డి సీఎం చంద్రబాబుపై, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసేలా అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. అలాగే గత నెలలో కర్నూలు ట్రావెల్స్ బస్సులో ప్రమాద ఘటనలో 19మంది చనిపోయారు. ఈ ఘటన జరిగిన తర్వాత కారుమూరు వెంకట్‌రెడ్డి ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో తాడిపత్రిలో టీడీపీ నేత ప్రసాదనాయుడు వెంకట్‌రెడ్డిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారట. తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి.. వెంకట్‌రెడ్డి మొబైల్ సిగ్నల్ ఆధారంగా హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఉన్నట్లు గుర్తించారు. ఆయన మెరీనా స్కైస్ అపార్ట్‌మెంట్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. ఇటీవల కర్నూలు ట్రావెల్స్ బస్సు ప్రమాదంపై అభ్యంతరకరంగా వ్యాఖ్యలు, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వైఎస్సార్‌సీపీ నేతలపై కూడా కేసులు నమోదు చేశారు పోలీసులు. ఈ క్రమంలో వారికి నోటీసులు అందజేసి విచారణకు పిలిచి ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ నేతలు శ్యామల, పూడి శ్రీహరితో పాటుగా పలువుర్ని ప్రశ్నించారు. తాజాగా కారుమూరు వెంకట్‌రెడ్డిని కూడా ఈ కేసులో అరెస్ట్ చేశారా?.. సతీశ్‌కుమార్ మరణంపై చేసిన వ్యాఖ్యల కేసులో అరెస్ట్ చేశారా అన్నది చూడాలి. అయితే కారుమూరు వెంకట్‌రెడ్డి అరెస్ట్‌పై తాడిపత్రి పోలీసులు క్లారిటీ ఇవ్వాల్సి ఉంది.

# సీఐఐ సమ్మిట్‌లో ఆ జిల్లాకు వేల కోట్ల పెట్టుబడులు



**విశాఖపట్నం :** విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సమ్మిట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రికార్డు స్థాయిలో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించింది. సీఎం చంద్రబాబు పాలనా దక్షతకు ఈ పెట్టుబడుల ప్రవాహం నిదర్శనమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతు లు కొనియాడారు. ఈ పెట్టుబడుల్లో నెల్లూరు జిల్లాకు పారిశ్రా మికంగా భారీగా లబ్ధి చేకూరనుంది. ఈ సదస్సు విజయవంతం కావడంతో ప్రభాకర్ రెడ్డి దంపతులు తమ నివాసంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, మంత్రి నారా లోకేష్ నిరంతర కృషి వల్లే ఈ సీఐఐ సమావేశం విజయంవంతమైందని ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తొలుత రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులను అంచనా వేస్తే, అంతకుమించి రూ.13,25,716 లక్షల కోట్ల పెట్టుబ డులకు ఎంవోయూలు కుదుర్చుకోవడం దేశంలోనే అత్యధిక మని, ఇది గొప్ప విషయమని ఆనందం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో దాదాపు 16 లక్షల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని వెల్లడించారు. పేపర్లపై కాకుండా నేలపై శంకుస్థాపనలు చేసి, ఆ కంపెనీలను పూర్తి చేసేలా ఫాలోఅప్ చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాకు రూ.6,815 కోట్ల పెట్టుబడులురాష్ట్ర స్థాయి పెట్టుబడులతో పాటు జిల్లా స్థాయిలో కూడా భారీగా అభివృద్ధి జరగనుందని ఎంపీ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. నెల్లూరు జిల్లాకు మొత్తం రూ.6, 815 కోట్ల పెట్టుబడుల ద్వారా 4,800 మందికి ఉద్యోగాలు రానున్నట్లు తెలిపారు. ఈ పెట్టుబడుల్లో ప్రముఖంగా జేఎం బాక్సీ గ్రూప్ సంస్థ రూ.3 వేల కోట్లతో మెరైన్ సర్వీస్, లాజిస్టిక్స్, పోర్ట్ బేస్డ్ కంపెనీని ఏర్పాటు చేయనుండగా దీని ద్వారా 3 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. అలాగే ఇండోసోల్ కంపెనీ రూ.2,200 కోట్లతో ఏర్పాటు కానుంది. ఐటీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన ఆర్‌సీఆర్‌టీ కంపెనీ రూ.1615 కోట్లు పెట్టుబడులు పెట్టనుండగా.. దీని ద్వారా 1300 మంది ఉద్యోగాలు పొందుతారని వివరించారు. త్వరలోనే గ్లాస్ తయారీ కంపెనీలు కూడా జిల్లాకు రాబోతున్నాయని ఆయన ప్రకటించారు. పాలనా దక్షత %-% దార్శనికతగత ప్రభుత్వ విధానాల కారణంగా రాష్ట్రం వదిలి వెళ్లిపోయిన ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్, లూలూ, బి.ఆర్. షెట్టి గ్రూప్, టైటాన్ వంటి ప్రముఖ పరిశ్రమలు తిరిగి రాష్ట్రానికి వస్తున్నాయంటే అది సీఎం చంద్రబాబు నాయుడు పాలనా నైపుణ్యం అని ఎంపీ కొనియాడారు. ఇతర రాష్ట్రాలు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ గురించి ఆలోచిస్తుంటే, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు రాష్ట్రాన్ని తీసుకువెళుతున్నారని ఆయన వివరించారు. 2029 నాటికి రాష్ట్రాన్ని దేశంలోనే తొలిస్థానంలో ఉండేలా అభివృద్ధి చేస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# ఏయ్ నువ్వెందుకు వచ్చావ్ ఎవడు రమ్మన్నాడు



**విశాఖపట్నం:** సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరోసారి కోపగించుకున్నారు. సాధారణంగా ఎప్పుడూ ఉల్లాసం గా, ఉత్సాహంగా కనిపిస్తుంటారు బాలయ్య. అలాంటి బాలయ్య కు కోపం వస్తే ఎలాం ఉంటుందో అందరికీ తెలిసిన సంగతే. ఆగ్రహంతో ఊగిపోతుంటారు. అయితే బాలకృష్ణ ఎంత కోప్పడినా. అది మా బాలయ్య ప్రేమ అంటూ మురిసిపోతుంటారు. బాలకృష్ణ కోపానికి సంబంధించి గతంలో ఎన్నో ఘటనలు చూశాం. తాజాగా మరోసారి ఇలాంటి ఘటనే చోటుచేసుకుంది. విశాఖపట్నం విమానాశ్రయంలో ఈ ఘటన జరిగింది. అయితే ఏం జరిగిందనే దానిపై క్లారిటీ లేదు కానీ.. ఓ వ్యక్తిని చూసి బాలయ్య చిందులేశారు. నువ్వెందుకు వచ్చావ్ ఇక్కడికీ అంటూ కోపంతో ఊగిపోయారు. నిన్ను ఇక్కడికి ఎవడు రమ్మన్నాడు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వెళ్లిపో.. సాయంత్రం కూడా వాడు కనిపించకూడదు అంటూ పక్కనున్న వారికి సూచించారు. అయితే ఎవరా వ్యక్తి.. ఏం జరిగిందనేది తెలియడం లేదు కానీ.. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అయితే తనను పలకరించడానికి వచ్చిన మహిళలతో అభిమానంగా మాట్లాడారు బాలకృష్ణ. సెల్ఫీలు కూడా దిగారు. మరోవైపు బాలకృష్ణ నటిస్తున్న లేటెస్ట్ మూవీ అఖండ 2 తాండవం.. డిసెంబర్ నెలలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్స్ నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే అఖండ 2 టీమ్ విశాఖలో ఈవెంట్ నిర్వహిస్తోంది. ఈ ఈవెంట్ కోసం నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీనివాస్, నిర్మాత రామ్ ఆచంట విశాఖకు చేరుకున్నారు. ఎయిర్ పోర్టులో ఈ ఘటన చోటుచేసుకుంది. మరోవైపు విశాఖ చేరుకున్న బాలకృష్ణ.. సింహాచలం అప్పన్నను దర్శించుకున్నారు. డైరెక్టర్ బోయపాటి శ్రీను, ప్రొడ్యూసర్ రామ్ ఆచంటతో కలిసి సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారినిదర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన అఖండ 2 చిత్ర బృందానికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. బృందం ప్రదక్షిణలు చేసింది. ఆ తరువాత శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి మూల విరాట్టును దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సినిమా యూనిట్‌కు వేద ఆశీర్వచనం అందించారు. మరోవైపు అఖండ 2 సినిమాలోని తాండవం పాట ఇటీవల విడుదలైన సంగతి తెలిసిందే. దీనికి మంచి స్పందన లభిస్తోంది.



# పాకిస్తాన్ సంచలన విజయం

రైజింగ్ స్టార్ ఆసియా కప్ 2025లో భాగంగా పాకిస్తాన్ షాహీన్స్, యూఏఈ జట్ల మధ్య జరిగిన 9వ మ్యాచ్‌లో పాకిస్తాన్ సంచలన విజయం నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో పాకిస్తాన్ బౌలర్లు చూపించిన ఆధిపత్యం మామూలుగా లేదు. యూఏఈ జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేయడంతో పాటు, పాకిస్తాన్ బ్యాటర్లు కేవలం 32 బంతుల్లోనే లక్ష్యాన్ని ఛేదించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన యూఏఈ జట్టు బ్యాటింగ్ ఎంచుకోవడం పూర్తిగా తప్పుగా నిరూపించబడింది. పాకిస్తాన్ బౌలర్లు తొలి ఓవర్ నుంచే వికెట్లు తీయడం మొదలుపెట్టారు. యూఏఈ బ్యాటర్లు ఎవరూ క్రీజులో నిలవలేకపోయారు. దీంతో యూఏఈ జట్టు కేవలం 18 ఓవర్లలోనే 59 పరుగులు చేసి ఆలౌట్ అయింది. యూఏఈ తరఫున సయ్యద్ హైదర్ 19 బంతుల్లో 20 పరుగులు చేయగా, మహమ్మద్ ఫరాజుద్దీన్ 12 పరుగులు మాత్రమే చేయగలిగాడు. మిగిలిన బ్యాటర్లు ఎవరూ రెండంకెల స్కోరు కూడా దాటలేకపోయారు. పాకిస్తాన్ బౌలర్లలో సూఫియాన్ ముకీమ్ అద్భుతంగా రాణించాడు. సూఫియాన్ ముకీమ్ 4 ఓవర్లు బౌలింగ్ చేసి కేవలం 12 పరుగులు ఇచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. అహ్మద్ డానియాల్ 3 ఓవర్లలో 7 పరుగులు ఇచ్చి 2 వికెట్లు తీశాడు. మాజ్ సదాకత్ కూడా 2 వికెట్లు తీశాడు. వీరే కాకుండా, షాహిద్ అజీజ్, అరఫాత్ మిన్హాస్, ముహమ్మద్ షాజాద్ తలో ఒక వికెట్ తీసుకున్నారు. పాకిస్తాన్ జట్టుకు 60 పరుగుల సులువు లక్ష్యం లభించింది. ఈ లక్ష్యాన్ని పాకిస్తాన్ కేవలం 5.2 ఓవర్లలోనే, ఒక వికెట్ కోల్పోయి ఛేదించి వేసింది. అంటే, లక్ష్యాన్ని చేరుకోవడానికి వారికి కేవలం 32 బంతులు మాత్రమే అవసరమయ్యాయి. పాకిస్తాన్ బ్యాట్స్‌మెన్ మాజ్ సదాకత్ 15 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 37 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి నాటౌట్‌గా నిలిచాడు. మరో బ్యాటర్ గాజీ ఘోరీ 12 బంతుల్లో 16 పరుగులు చేసి అజేయంగా వెనుదిరిగాడు. ఈ అద్భుతమైన విజయంతో పాకిస్తాన్ షాహీన్స్ గ్రూప్ బిలో తమ ఆధిపత్యాన్ని కొనసాగించింది. ఈ టోర్నమెంట్‌లో పాకిస్తాన్ ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది. అంతకుముందు భారత్ మరియు ఒమన్ జట్లను కూడా పాకిస్తాన్ ఓడించింది.

# బవుమా అరుదైన రికార్డు..



సొంతగడ్డ స్పిన్ పిచ్ మనకు అడ్డా! అలాంటి చోట, 124 పరుగుల టార్గెట్‌ను ఛేదించలేక టీమ్‌ఇండియా కుప్పకూలడం ఫ్యాన్స్‌కు పెద్ద షాక్. 15 ఏళ్ల తర్వాత మన గడ్డపై సౌతాఫ్రికా టెస్ట్ గెలిచి చరిత్ర సృష్టించింది. అయితే, ఈ ఓటమి కంటే ఎక్కువగా ఇప్పుడు సౌతాఫ్రికా కెప్టెన్ గురించే పెద్ద చర్చ నడుస్తోంది. అతను కెప్టెన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఓడిపోలేదు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో కూడా గెలిచాడు. సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా ఒక అరుదైన రికార్డును కొనసాగిస్తున్నాడు. అతను టెస్ట్ కెప్టెన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు సౌతాఫ్రికా ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. బవుమా మొత్తం 11 టెస్టులకు నాయకత్వం వహించగా, అందులో 10 మ్యాచ్‌లలో సౌతాఫ్రికా గెలిచింది, మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అతని కెప్టెన్సీలోనే ఆస్ట్రేలియాపై డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా గెలిచారు. ఇప్పుడు టీమ్‌ఇండియా లాంటి బలమైన జట్టును సొంత గడ్డపై ఓడించి, తన అజేయమైన రికార్డును కొనసాగించడం విశేషం. ఈ మ్యాచ్ ఓటమికి పూర్తిగా భారత బ్యాటర్లదే బాధ్యత. 124 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్‌ఇండియా, కేవలం 93 పరుగులకే కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. మన టాప్ ఆర్డర్ పూర్తిగా ఫెయిల్ అయింది. యశస్వి జైస్వాల్ (0), కేఎల్ రాహుల్ (1), కెప్టెన్ రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (13) దారుణంగా విఫలమయ్యారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (31), రవీంద్ర జడేజా (18), అక్షర్ పటేల్ (26) కాసేపు పోరాడినా, అది విజయానికి సరిపోలేదు. స్పిన్ పిచ్‌పై సౌతాఫ్రికా స్పిన్నర్లు చెలరేగిపోయారు. ఈ పిచ్‌ను ఇండియా స్పిన్నర్లు (జడేజా, అక్షర్, కుల్దీప్) కోసం తయారుచేశారు. కానీ, మన స్పిన్నర్ల కంటే సౌతాఫ్రికా స్పిన్నర్ సైమన్ హర్మర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 8 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరోవైపు కేశవ్ మహారాజ్ కూడా కీలక వికెట్లు తీశాడు. మన బ్యాటర్లు సొంత పిచ్‌పైనే స్పిన్‌ను ఆడలేక చేతులెత్తేయడం విమర్శలకు తావిస్తోంది. 15 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత సౌతాఫ్రికా మన గడ్డపై టెస్ట్ మ్యాచ్ గెలవడం ఇదే తొలిసారి. ఓటమి తర్వాత కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ, "మేము ఈ లక్ష్యాన్ని ఛేదించాల్సింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఒత్తిడి పెరిగిపోయింది" అని ఒప్పుకున్నాడు. అయితే, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం పిచ్‌ను వెనకేసుకొచ్చాడు. "ఇది ఆడలేని వికెట్ ఏమీ కాదు. మాకు కచ్చితంగా ఇలాంటి వికెట్లే కావాలి. క్యూరేటర్ మాకు పూర్తి సపోర్ట్ ఇచ్చాడు" అని అన్నాడు. అంటే, మనకు కావాలని స్పిన్ పిచ్ తయారు చేయించుకుని, మనమే అందులో ఫెయిల్ అయ్యామని గంభీర్ పరోక్షంగా ఒప్పుకున్నాడు. ఇది గత 6 హోమ్ టెస్టుల్లో ఇండియాకు 4వ ఓటమి కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో సౌతాఫ్రికా గెలిచిందంటే, దానికి కెప్టెన్ బవుమా బ్యాటింగ్ కూడా ఒక కారణం. రెండో రోజు ఆట ముగిసేసరికి సౌతాఫ్రికా 93/7తో, కేవలం 63 పరుగుల ఆధిక్యంలో ఉంది. మూడో రోజు ఇండియా త్వరగా వికెట్లు తీస్తుందనుకుంటే, కెప్టెన్ బవుమా (55 నాటౌట్) అడ్డుగోడలా నిలబడ్డాడు.

# బాబర్ పై కొరడా ఝుళిపించిన ఐసీసీ



పాకిస్తాన్ మాజీ కెప్టెన్, స్టార్ బ్యాట్స్‌మెన్ బాబర్ అజామ్ పై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ చర్య తీసుకుంది. ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని లెవల్ 1 నిబంధనను ఉల్లంఘించినందుకు గాను, బాబర్ అజామ్‌పై అతని మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా విధించారు. ఈ సంఘటన శ్రీలంకతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో జరిగింది. ఆటగాళ్ల క్రమశిక్షణ విషయంలో ఐసీసీ ఎంత కఠినంగా ఉంటుందో ఈ సంఘటన మరోసారి నిరూపించింది. రావల్పిండిలో నవంబర్ 16న జరిగిన పాకిస్తాన్ %జం% శ్రీలంక మూడో వన్డే మ్యాచ్‌లో ఈ సంఘటన చోటు చేసుకుంది. పాకిస్తాన్ బ్యాటింగ్ చేస్తున్న 21వఓవర్‌లో, బాబర్ అజామ్ అవుట్ అయిన తర్వాత క్రీజ్ వదిలి వెళ్లే ముందు తన బ్యాట్‌తో స్టంప్స్‌ను కొట్టాడు (లేదా బంతిని స్టంప్స్‌పై కొట్టాడు). ఈ చర్యను ఐసీసీ ఆచార నియమావళిలోని ఆర్టికల్ 2.2 ఉల్లంఘనగా పరిగణించారు. ఈ ఆర్టికల్ అంతర్జాతీయ మ్యాచ్‌ల సమయంలో క్రికెట్ పరికరాలు, మైదాన పరికరాలు లేదా ఫిట్టింగ్‌లను దుర్వినియోగం చేయకుండా ఉండాలని చెబుతుంది. జరిమానాతో పాటు బాబర్ అజామ్ క్రమశిక్షణ రికార్డులో ఒక డీమెరిట్ పాయింట్ కూడా యాడ్ చేశారు. గత 24 నెలల కాలంలో బాబర్ అజామ్‌కు ఇది మొదటి తప్పిదం. మైదానంలో ఉన్న అంపైర్లు, థర్డ్ అంపైర్, ఫోర్త్ అంపైర్ ఈ ఆరోపణలను నమోదు చేశారు. ఆ తర్వాత ఐసీసీ ఇంటర్నేషనల్ ప్యానెల్ ఆఫ్ మ్యాచ్ రిఫరీ అయిన అలీ నక్వీ జరిమానాను ప్రతిపాదించారు. బాబర్ అజామ్ తన తప్పును అంగీకరించడంతో, ఎలాంటి అధికారిక విచారణ అవసరం లేకుండానే జరిమానాను ఆమోదించారు. ఈ మూడో వన్డే మ్యాచ్‌లో పాకిస్తాన్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. శ్రీలంక జట్టు 45.2 ఓవర్లలో కేవలం 211 పరుగులకే ఆలౌట్ అయింది. సదీరా సమరవిక్రమ 48 పరుగులు చేశాడు. పాకిస్తాన్ బౌలర్లలో మహమ్మద్ వసీం జూనియర్ 3 వికెట్లు తీశాడు. పాకిస్తాన్ 44.4 ఓవర్లలో లక్ష్యాన్ని ఛేదించి గెలిచింది. పాకిస్తాన్ తరఫున ఫఖర్ జమాన్ 55 పరుగులు, మహమ్మద్ రిజ్వాన్ 61 పరుగులు, హుస్సేన్ తలత్ అజేయంగా 42 పరుగులు చేశారు. శ్రీలంక బౌలర్ జెఫ్రీ వాండర్సే 3 వికెట్లు పడగొట్టాడు.

# రెండో టెస్ట్ కోసం ప్యాడ్‌ను తీసేసి ప్రాక్టీస్!



సౌతాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా 30 పరుగుల తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్‌లు సౌతాఫ్రికా స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు తీయడానికి చాలా కష్టపడ్డారు. ఈ సమస్యను అధిగమించేందుకు భారత జట్టు ఇప్పుడు వినూత్నంగా, చాలా సాహసోపేతమైన ప్రాక్టీస్ విధానాన్ని మొదలుపెట్టింది. ఈ స్పెషల్ ట్రైనింగులో ఆటగాళ్లకు గాయాలయ్యే ప్రమాదం ఉన్నా, దాన్ని లెక్కచేయకుండా బ్యాటర్లు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. గువహతిలో నవంబర్ 22 నుంచి జరగబోయే రెండో టెస్టుకు ముందు టీమ్ ఇండియా అనుసరిస్తున్న ఈ గంభీరమైన ప్లాన్ వివరాలు చూద్దాం. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్టులో వైఫల్యం తర్వాత, భారత బ్యాటర్లు ప్రత్యేకంగా స్పిన్నర్లను ఎదుర్కోవడానికి ఒక వినూత్న వ్యూహాన్ని అనుసరించారు. బ్యాట్స్‌మెన్‌లు ఒక ప్యాడ్‌ను తీసేసి (ముందు కాలుకు ఉండే ప్యాడ్) సుమారు మూడు గంటల పాటు స్పిన్నర్ల బౌలింగ్‌ను ఎదుర్కొని ప్రాక్టీస్ చేశారు. ముందు కాలుకు ప్యాడ్ లేకుండా బ్యాటింగ్ చేయడం అంటే, బంతి కాలికి లేదా ఇతర భాగాలకు తగిలితే గాయమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇది ఒక పాత పద్ధతి. దీని ద్వారా బ్యాట్స్‌మెన్‌లు బంతిని కేవలం తమ ముందు ప్యాడ్‌తో అడ్డుకోవడానికి ప్రయత్నించకుండా, బ్యాట్‌ను మాత్రమే ఉపయోగించి ఆడటానికి అలవాటు పడతారు. భారత లెఫ్ట్ హ్యాండర్లలో బ్యాక్ ఫుట్‌పైకి వెళ్లి ఆడే ధోరణి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాక్టీస్ వారికి స్పిన్నర్ల బౌలింగ్‌ను ముందుకు వచ్చి ఆడటానికి, ప్యాడ్‌ను కాకుండా బ్యాట్‌ను ఎక్కువగా ఉపయోగించడానికి సహాయపడుతుంది. సోమవారం జరిగిన ఐచ్ఛిక ప్రాక్టీస్ సెషన్‌కు సీనియర్ సభ్యుల్లో రవీంద్ర జడేజా సహా కేవలం ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే హాజరయ్యారు. లెఫ్ట్ హ్యాండర్ సాయి సుదర్శన్ ముందు కాలుకు ప్యాడ్ లేకుండా దాదాపు మూడు గంటల పాటు సాధన చేశాడు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ గాయం కారణంగా రెండో టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఉండటంతో, సుదర్శన్ అతని స్థానాన్ని భర్తీ చేసే ఛాన్స్ ఉంది. మొదటి టెస్ట్‌లో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఆడి, ఆశించిన స్థాయిలో రాణించని ధ్రువ్ జురెల్ కూడా సుదర్శన్ లాగే ఒక ప్యాడ్ తీసి ప్రాక్టీస్ చేశాడు. గువహతి టెస్ట్‌లో కూడా టీమ్ మేనేజ్‌మెంట్ అతన్ని అదే పాత్రలో కొనసాగించే అవకాశం ఉంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ దగ్గరుండి సుదర్శన్ ప్రాక్టీస్‌ను పర్యవేక్షించారు. బ్రేక్ సమయంలో గంభీర్ వారిద్దరితో ఎక్కువ సమయం మాట్లాడటం కనిపించింది. స్పిన్నర్లకు వ్యతిరేకంగా ధైర్యంగా ఆడినప్పటికీ, ఈ ఇద్దరు బ్యాటర్లు పేస్ బౌలర్లను ఎదుర్కోవడంలో మాత్రం కొద్దిగా ఇబ్బంది పడ్డారు. పేస్ బౌలర్ల ముందు సుదర్శన్, జురెల్ అప్పుడప్పుడు ఇబ్బంది పడ్డారు. నెట్ బౌలర్ల స్వింగ్ బంతులకు కూడా వారి బ్యాట్‌కు ఎడ్జ్ తగలడం గమనించవచ్చు. గిల్ రెండో టెస్ట్ ఆడటం దాదాపు అసాధ్యం కావడంతో, యువ ఆల్‌రౌండర్ నితీష్ రెడ్డిని సౌత్ ఆఫ్రికా ఎ తో జరుగుతున్న ఇండియా ఎ సిరీస్ నుంచి వెనక్కి పిలిపించి, కోల్‌కతాకు తీసుకువచ్చారు.

# టెస్ట్ క్రికెట్‌ను ఖూనీ చేస్తున్నారు

**• మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్**



కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా ఎదుర్కొన్న పరాజయంపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక టీమిండియా 93 పరుగులకే కుప్పకూలడంపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి ర్యాంక్ టర్నర్లను తయారు చేస్తూ టెస్ట్ క్రికెట్‌ను పూర్తిగా నాశనం చేస్తున్నారని జట్టు యాజమాన్యంపై మండిపడ్డారు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ ఓటమి అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన హర్భజన్ సింగ్.. "టెస్ట్ క్రికెట్‌కు %=ఖ్రా% (రెస్ట్ ఇన్ పీస్). వారు ఈ ఫార్మాట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కొన్నేళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదు. కానీ ఇది సరైన పద్ధతి కాదు" అని ఆరోపించారు. దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ ఓటమి అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన హర్భజన్ సింగ్.. "టెస్ట్ క్రికెట్‌కు %=ఖ్రా% (రెస్ట్ ఇన్ పీస్). వారు ఈ ఫార్మాట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కొన్నేళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదు. కానీ ఇది సరైన పద్ధతి కాదు" అని ఆరోపించారు. ఇలాంటి పిచ్‌లపై ఆడటం వల్ల ఆటగాళ్లు ఏ మాత్రం ఎదగరని హర్భజన్ అభిప్రాయపడ్డారు. మీరు గానుగెద్దులా ఒకేచోట తిరుగుతున్నారే తప్ప ముందుకు వెళ్లడం లేదని భజ్జీ మండిపడ్డారు. బ్యాటర్లకు పరుగులు ఎలా చేయాలో కూడా తెలియని విధంగా పిచ్‌లను తయారుచేస్తున్నారని అన్నారు. నైపుణ్యంతో కాకుండా పిచ్ వల్లే వికెట్లు పడుతుంటే.. సమర్థుడైన బౌలర్‌కు, బ్యాటర్‌కు తేడా ఏముంటుందని ఆయన ప్రశ్నించారు. తొలి టెస్టులో రెండో రోజే 15 వికెట్లు పడటం, మూడో రోజు రెండు సెషన్లలోపే మ్యాచ్ ముగియడంతో పిచ్‌పై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి.

# గంభీర్ వల్లే టీమిండియాకు ఓటమి

**• టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్**


సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌లో టీమిండియాకు ఎదురైన ఓటమి నేపథ్యంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే టీమిండియా విజయాలు అందుకోలేకపోతుందని అభిమానులతో పాటు మాజీ క్రికెటర్లు మండిపడుతున్నారు. సోషల్ మీడియా వేదికగా గంభీర్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. తాజాగా ఈ జాబితాలోకి టీమిండియా మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ చేరాడు. నేరుగా గంభీర్‌పై విమర్శలు చేయకపోయినా.. టీమిండియా మేనేజ్‌మెంట్ కారణంగానే ఘోర పరాజయాలను ఎదుర్కొంటుందని అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా జట్టు వాతావరణం దెబ్బతిన్నదని, టీమ్‌లో ఒక్క ప్లేయర్ కూడా స్వేచ్ఛగా ఆడలేకపోతున్నారని ఆరోపించాడు. జట్టులో పదే పదే మార్పులు చేయడంతో ఆటగాళ్ల ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతుందని తెలిపాడు. ఏ ఒక్క ప్లేయర్‌కు కూడా టీమ్ మేనేజ్‌మెంట్ నుంచి మద్దతు లభించడం లేదన్నాడు. 'జట్టులో ఎవరు ఆడినా.. వారికి టీమ్ మేనేజ్‌మెంట్ మద్దతు ఉందనే భావనలో లేరు. ఒక్కరు కూడా ఆటగాళ్లను వెనకేసుకొని రావడం లేదు. జట్టులో ప్రతీ ఒక్కరు భయంతో ఉన్నారు. జట్టులో చోటు ఉంటుందో లేదోననే భయంతోనే ఆడుతున్నారు. ఒక్కరు కూడా స్వేచ్ఛగా ఆడటం లేదు. సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ చేసిన తర్వాత కూడా జట్టులో అతని చోటు ఖరారు కాలేదు. సెంచరీ తర్వాత అతను తిరిగి జట్టులోకి కూడా రాలేకపోయాడు. సాయి సుదర్శన్ 87 పరుగులు చేశాడు. అతను కూడా తదుపరి మ్యాచ్ ఆడలేదు. జట్టు అంతా గందరగోళంలో ఉంది.'అని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మహమ్మద్ కైఫ్ చెప్పుకొచ్చాడు. ఆటగాళ్లకు వరుసగా అవకాశాలు ఇచ్చి, వెన్ను తట్టి ప్రోత్సహించాలని కైఫ్ సూచించాడు. అప్పుడే ఆటగాళ్లు ఎలాంటి బెరుకు లేకుండా స్వేచ్ఛగా ఆడగలరని అభిప్రాయపడ్డాడు.



## 'వారణాసి' టైటిల్‌పై వివాదం..
# ఫిలిం ఛాంబర్‌లో ఫిర్యాదు

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి, సూపర్ స్టార్ మహేశ్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న ప్రతిష్ఠాత్మక చిత్రం టైటిల్‌పై వివాదం చెలరేగింది. ఇటీవలే 'గ్లోబ్ ట్రాటర్' పేరుతో భారీ ఈవెంట్ నిర్వహించి, ఈ చిత్రానికి 'వారణాసి' అనే టైటిల్‌ను ప్రకటించారు. అయితే, ఈ టైటిల్ తమదేనంటూ ఓ చిన్న సినిమా నిర్మాత ఫిలిం ఛాంబర్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే, సి.హెచ్. సుబ్బారెడ్డి దర్శకత్వంలో రామబ్రహ్మ హనుమ క్రియేషన్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ సినిమాకు 'వారణాసి' అనే టైటిల్‌ను తాము ముందుగానే ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ చేయించామని, ఇందుకు సంబంధించిన ఆధారాలు కూడా ఉన్నాయని నిర్మాత విజయ్ కె. తెలిపారు. తమ అనుమతి లేకుండా రాజమౌళి తమ టైటిల్‌ను ఎలా ప్రకటిస్తారని ఆయన ప్రశ్నిస్తూ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశారు. ఛాంబర్ జారీ చేసిన రిజిస్ట్రేషన్ పత్రాన్ని కూడా వారు మీడియాకు విడుదల చేశారు.



## బాలకృష్ణ 111వ చిత్రంలో
# లేడీ సూపర్‌స్టార్...

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం నుంచి ఓ అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో కథానాయికగా లేడీ సూపర్‌స్టార్ నయనతార నటిస్తున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. మంగళవారం నయనతార పుట్టినరోజును పురస్కరించుకుని ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా దర్శకుడు గోపీచంద్ మలినేని తన ఎక్స్ ఖాతాలో.. "క్వీన్ నయనతార గారికి ప్రపంచంలోకి స్వాగతం. మా కథలో ఆమె శక్తి, గాంభీర్యం ఉన్నందుకు గౌరవంగా భావిస్తున్నాం. మీకు పుట్టినరోజు శుభాకాంక్షలు. మిమ్మల్ని త్వరలో సెట్‌లో కలుసుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం" అని పోస్ట్ చేశారు. నిర్మాణ సంస్థ వృద్ధి సినిమాస్ కూడా నయనతారకు స్వాగతం పలుకుతూ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బాలకృష్ణ, గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది ఒక చారిత్రక ఇతివృత్తంతో రూపొందుతుండగా, బాలకృష్ణను మునుపెన్నడూ చూడని సరికొత్త అవతారంలో చూపించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్న ఈ సినిమాను నవంబర్‌లో లాంఛనంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కోసం రాజస్థాన్‌లోని పలు అందమైన లొకేషన్లను చిత్ర యూనిట్ పరిశీలించింది. బాలయ్య, నయన్ కాంబోలో ఇది మరో బ్లాక్‌బస్టర్ అవుతుందని అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.






# నటనకు వీడ్కోలు..

## రిటైర్మెంట్ తేదీ ప్రకటించిన నటి తులసి!

ప్రముఖ నటి, ఎన్నో చిత్రాల్లో తల్లి పాత్రలతో మెప్పించిన తులసి తన సినీ ప్రస్థానానికి ముగింపు పలకాలని నిర్ణయించుకున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31వ తేదీతో తాను నటన నుంచి వైదొలగుతున్నట్లు సోషల్ మీడియా వేదికగా అధికారికంగా ప్రకటించారు. ఈ వార్త సినీ వర్గాల్లో, అభిమానుల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. మూడున్నర నెలల వయసులోనే 'జీవన తరంగాలు' చిత్రంతో కెమెరా ముందుకు వచ్చిన తులసి, తన సుదీర్ఘ కెరీర్‌కు వీడ్కోలు చెబుతున్నట్లు తెలిపారు. తన తల్లి అలనాటి నటి సావిత్రికి స్నేహితురాలు కావడంతో, ఆ చిత్రంలో ఉయ్యాలలో పసిపాప పాత్రలో ఆమె నటించారు. ఆ తర్వాత నాలుగేళ్ల వయసు నుంచి బాలనటిగా తెలుగు, తమిళం, కన్నడ, భోజ్‌పురి భాషల్లో ఎన్నో చిత్రాలు చేశారు. కొన్ని సినిమాల్లో కథానాయికగా కూడా నటించి గుర్తింపు పొందారు. కన్నడ దర్శకుడు శివమణిని వివాహం చేసుకున్న తర్వాత కొంతకాలం నటనకు విరామం ఇచ్చారు. అనంతరం క్యారెక్టర్ ఆర్టిస్టుగా రీఎంట్రీ ఇచ్చి, తల్లిగా నటించి ప్రేక్షకుల మదిలో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.


గత కొంతకాలంగా సినిమాలను తగ్గించుకున్న ఆమె, సాయిబాబాపై తనకున్న భక్తిని తరచూ చాటుకుంటున్నారు. ఈ క్రమంలోనే, డిసెంబర్ 31న సాయిబాబా దర్శనానికి వెళుతున్నానని, అదే రోజు తన నటన జీవితానికి చివరి రోజని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. దీంతో ఆమె సినీ ప్రయాణం ముగియనుంది.

## సినీ దర్శకుడు
# రాజమౌళిపై కేసు నమోదు



ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి వివాదంలో చిక్కుకున్నారు. హనుమంతుడిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారంటూ 'రాష్ట్రీయ వానరసేన' అనే సంస్థ ఆయనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఈ ఫిర్యాదును అందజేసింది. 'వారణాసి' సినిమా టైటిల్ లాంచింగ్ కార్యక్రమంలో రాజమౌళి చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశాయని ఆ సంస్థ ఆరోపించింది. ఫిర్యాదులో వానరసేన సభ్యులు పలు అంశాలను ప్రస్తావించారు. "ఇటీవల సినిమాల్లో హిందూ దేవతలను కించపరిచే ధోరణి పెరిగింది. మత విశ్వాసాలను దెబ్బతీయడం చట్టవిరుద్ధం. రాజమౌళిపై కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరపాలి" అని వారు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో సినీ పరిశ్రమలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వానరసేన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయం బయటకు రావడంతో సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చ జరుగుతోంది. కొందరు రాజమౌళి వ్యాఖ్యలను తప్పుబడుతుంటే, మరికొందరు ఆయన మాటలను అపార్థం చేసుకున్నారని సమర్థిస్తున్నారు. ఇక 'వారణాసి' చిత్రం రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతుండగా, మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని 2027లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# భాగ్యశ్రీని పొగడ్తలతో ముంచెత్తిన రానా!



ప్రముఖ నటుడు రానా దగ్గుబాటి తాను కీలక పాత్రలో నటించిన 'కాంత' సినిమా హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఇటీవల భాగ్యశ్రీ తన సోషల్ మీడియా పోస్ట్‌లో రానాను నిజమైన స్నేహితుడని, తన మెంటార్ అని అభివర్ణించింది. ఈ పోస్ట్‌పై రానా స్పందిస్తూ భాగ్యశ్రీ అంకితభావాన్ని, వృత్తిపట్ల ఆమెకున్న నిజాయతీని కొనియాడాడు. ఈ విషయంపై రానా మాట్లాడుతూ "భాగ్యశ్రీ అలా చెప్పడం ఆమె మంచితనం. ఆమె చాలా సిన్సియర్. ఈ సినిమా కోసం బాంబే నుంచి వచ్చిన ఆమె, తమిళం నేర్చుకోవాలని మేము చెప్పగానే ఏకంగా ఆరు నెలల పాటు ఇక్కడే ఉండి భాష నేర్చుకుంది. ఈ రోజుల్లో ఇంతటి అంకితభావం చూడటం చాలా అరుదు. ఆమె నిజాయతీ అసాధారణం" అని పేర్కొన్నాడు. "ప్రారంభంలో మేము కొంచెం కంగారుపడ్డాం. దుల్కర్ సల్మాన్, సముద్రఖని వంటి గొప్ప నటులతో సరిపోయే కొత్త అమ్మాయి కావాలని అనుకున్నాం. కానీ ఆమె నటిస్తేనే అది సాధ్యమవుతుంది. అయితే, టెస్ట్ షూట్ ప్రారంభమైన కొద్ది రోజులకే మా 'కుమారి' పాత్రకు సరైన నటి దొరికిందని మాకు అర్థమైంది" అని రానా వివరించాడు.



# యువన్ సంగీతంలో ఇళయరాజా పాట..

## తొలిసారి కలిసి పాడిన తండ్రీకొడుకులు

భారత సినీ సంగీత ప్రపంచంలో ఓ అరుదైన ఘట్టం ఆవిష్కృతమైంది. సంగీత దిగ్గజం ఇళయరాజా తన చిన్న కుమారుడు, ప్రముఖ సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా సంగీతంలో తొలిసారి ఓ పాట పాడారు. వీరిద్దరూ కలిసి ఆలపించిన ఈ ప్రత్యేక గీతం 'కొంబుసీవి' అనే తమిళ చిత్రంలోనిది. తండ్రీకొడుకులు ఇద్దరూ దేశంలోనే అగ్రశ్రేణి సంగీత దర్శకులు కావడంతో ఈ కలయికపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. యువన్ శంకర్ రాజా స్వరపరిచిన ఈ పాట ఎంతో భావోద్వేగంగా సాగుతుందని చిత్రబృందం తెలిపింది. గీత రచయిత పా. విజయ్ రాసిన ఈ పాట "అమ్మా ఎన్ తంగక్కని, నీతానే ఎల్లామ్ ఇని" అంటూ ప్రారంభమవుతుంది. ఇళయరాజా, యువన్ ఇద్దరూ కలిసి ఆలపించిన ఈ గీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చెబుతున్నారు. పొన్రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో సీనియర్ నటుడు శరత్ కుమార్, కెప్టెన్ విజయకాంత్ కుమారుడు షణ్ముగ పాండియన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. స్టార్ సినిమాస్ బ్యానర్‌పై ముఖేష్ టి. చెల్లయ్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో కామెడీ, యాక్షన్‌కు సమాన ప్రాధాన్యం ఉంటుందని సమాచారం. థేని, ఉసిలంపట్టి ప్రాంతాల నేపథ్య కథతో రూపొందుతున్న ఈ సినిమాలో తర్నిక హీరోయిన్‌గా నటిస్తోంది. మునీష్కాంత్, కాళీ వెంకట్ తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. డిసెంబర్‌లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

